TGTEL/26/A4846

# నవ సంఘర్షణ

తెలుగు దినపత్రిక

www.navasangharshana.com

CEO &chief editor: Medi Naresh

హైదరాబాద్ సంపుటి: 01. సంచిక: 6 గురువారం 6-08-2026 చీఫ్ ఎడిటర్: మేడి నరేష్ పేజీలు-8 వేల :2.00/-

## ఎర్ర సముద్రంలో భారత నౌకపై దాడి..



న్యూఢిల్లీ ఆగస్టు 5 నవ సంఘర్షణ

యెమెన్ తీరానికి సమీపంలోని ఎర్ర సముద్రంలో ప్రయాణిస్తున్న భారత వాణిజ్య నౌకపై దాడి జరిగింది. ఈ ఘటనలో నౌక పూర్తిగా మునిగిపోయిందని, అయితే అందులోని 13 మంది భారతీయ సిబ్బంది సహా మొత్తం 14 మంది సురక్షితంగా బయటపడ్డారని కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్ శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్ తెలిపారు. 'ఎంఎస్‌వి ఫైజే నూరే ఓలియా' అనే భారత జెండాతో ఉన్న నౌకపై ఆగస్టు 4న ప్రొజెక్టైల్ (క్షిపణి లాంటిది)తో దాడి జరిగింది. దీంతో నౌక బోల్తా పడి సముద్రంలో మునిగిపోయింది. వెంటనే స్పందించిన యెమెన్ కోస్ట్ గార్డ్, సిబ్బంది అందరినీ రక్షించి సమీపంలోని మోఖా పోర్టుకు తరలించారు. ఈ ఘటనపై భారత ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. "నిరాయుధులైన సిబ్బంది ఉన్న నౌకపై జరిగిన ఈ అకారణ దాడిని భారత్ తీవ్రంగా ఖండిస్తోంది. మన ప్రజల భద్రతే మాకు అత్యంత ముఖ్యం. సిబ్బంది అందరూ సురక్షితంగా ఉన్నారని తెలియజేయడం ఊరటనిస్తోంది" అని మంత్రి సోనోవాల్ పేర్కొన్నారు. సిబ్బంది సంక్షేమం, భద్రత కోసం అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు.



# ఎల్‌నినో మరింత ఉధృతం

- భారత్‌లో తగ్గనున్న రుతుపవన వర్షాలు
- మధ్య, దక్షిణ భారతంలో తేమ కొరత
- అస్సాంలో వరదలు.. పలు ప్రాంతాల్లో కరువు ముప్పు
- నిప్పుల కొలిమిగా మారిన ఐరోపా
- ఫ్రాన్స్‌లో కార్చిచ్చులు.. లక్షల మంది నిరాశ్రయులు
- యూరప్‌లో రికార్డు స్థాయి అగ్నిప్రమాదాలు
- అమెరికాను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న వడగాలులు
- ప్రపంచాన్ని వణికిస్తున్న ఎల్‌నినో ప్రభావం
- డబ్ల్యూఎంఓ హెచ్చరికతో అప్రమత్తమైన దేశాలు

2

### ఆగస్టు, సెప్టెంబర్‌లో తీవ్రతరం

ఎల్‌నినో ప్రభావం మరింత తీవ్రం కానుంది. ఆగస్టు--సెప్టెంబర్‌లో భారత్‌లో సాధారణం కంటే తక్కువ వర్షాలు, మధ్య--దక్షిణ రాష్ట్రాల్లో వర్షాభావం, అసోంలో వరదల ముప్పు పెరుగుతుండగా... యూరప్ అడవి మంటలు, అమెరికా తీవ్ర ఉష్ణోగ్రతలతో అల్లాడుతోంది. ప్రపంచ వాతావరణంపై ఎల్‌నినో ప్రభావం మరింత ఉద్ధృతం కానుందని డబ్ల్యూఎంఓ హెచ్చరించింది.



## రాళ్లు రువ్వినా.. అహింసే మార్గం!

- యువత మాట వినండి
- వారిని కూల్ చేయండి
- మాట వినడమే అతి పెద్ద ఆయుధం
- రాళ్లు విసురుతున్న యువతకు కౌన్సెలింగ్ చేయండి.. తద్వారా వారిని శాంతింపచేయండి
- భద్రతా బలగాలు సంయమనం పాటించాలి
- శాంతియుత నిరసనలను ప్రోత్సహించాలి
- పోలీసులకు ఇవి తెలిసిన జాగ్రత్తలే
- జంతర్‌మంతర్ అల్లర్ల కేసులపై సుప్రీం కోర్టు హితవు

02



## ప్రజల గడపకే ప్రజా ప్రభుత్వం

- సమస్యల పరిష్కారమే లక్ష్యం
- ప్రజల విశ్వాసమే మా బలం
- ప్రతి అర్థికీ న్యాయం చేస్తాం
- ప్రజల మాటే ప్రభుత్వ నిర్ణయాలకు మార్గదర్శకం
- మంత్రి సీతక్క

హైదరాబాద్

ప్రజలతో నేరుగా ముఖాముఖి అయ్యేందుకు, వారి సమస్యలను స్వయంగా తెలుసుకుని పరిష్కరించేందుకే గాంధీభవన్‌లో "ప్రజలతో ముఖాముఖి" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ప్రతి బుధవారం గాంధీభవన్‌లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో మంత్రి పాల్గొని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి నేరుగా వినతిపత్రాలు స్వీకరించారు. గత ప్రభుత్వంలో ప్రజలకు తమ సమస్యలను చెప్పుకునే అవకాశం కూడా లేకుండా పోయిందని, పాలకులు ప్రజలకు దూరంగా ఉండటంతో అనేక సమస్యలు పేరుకుపోయాయని విమర్శించారు. ప్రజల కష్టాలు, బాధలు, ఆశలు, ఆకాంక్షలు తెలుసుకోవాలంటే ప్రజల మధ్యకే వెళ్లాలని, అందుకే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతి బుధవారం నిర్వహిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు అందజేసిన ప్రతి వినతిపత్రాన్ని మంత్రి సీతక్క క్షుణ్ణంగా పరిశీలించారు. సమస్యల స్వభావాన్ని తెలుసుకుంటూ సంబంధిత శాఖల

-మిగతా 2 లో

# పర్మిషన్లు ఇవ్వండి ప్లీజ్!

- కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి వినతి పత్రం
- తుమ్మిడిహెట్టిపై ఇరువురి మధ్య సుదీర్ఘ చర్చ
- పీఎంవో నుంచి లేఖ అందిందని తెలిపిన పాటిల్
- చర్చల ప్రక్రియ ప్రారంభిస్తామని హామీ
- మరో కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్‌తో సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ తదితరుల భేటీ
- పాలమూరు-రంగారెడ్డి, గౌరవెల్లి, సీతమ్మసాగర్, డిండి ప్రాజెక్టులకు సత్వరమే పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని వినతి

### తుమ్మిడిహెట్టిపై మహారాష్ట్రతో మీటింగ్ పెట్టించండి

ఢిల్లీ:

ప్రాణహిత నదిపై నిర్మించనున్న తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు పెంపునకు మహారాష్ట్ర ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతులు త్వరితగతిన వచ్చేలా కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి జల్‌శక్తి మంత్రిత్వ శాఖ కార్యాలయంలో కేంద్ర మంత్రితో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యతను సమగ్రంగా వివరించిన ముఖ్యమంత్రి, ప్రాజెక్టుకు సంబంధించిన అనుమతుల కోసం తాను ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి రాసిన లేఖను గుర్తు చేశారు. ఆ లేఖపై ప్రధానమంత్రి కార్యాలయం స్పందించి సంబంధిత అంశాన్ని జల్‌శక్తి శాఖకు పంపిన విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం ఈ

-మిగతా 2 లో







## 8 సెకన్ల లోపే నిద్రలోకి జారుకుంటా!

- రోజుకు మూడున్నర గంటలు మాత్రమే నిద్రపోతా
- క్రమం తప్పకుండా యోగా చేస్తా
- ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించండి
- సోషల్ మీడియాలో చురుగ్గా ఉండండి
- ఢిల్లీ రాజకీయాల వలలో చిక్కుకోవద్దు
- లెటర్ హెడ్ వాడకంలో జాగ్రత్త
- మీడియాతో మాట్లాడేటప్పుడు బీ కేర్‌ఫుల్
- బీజేపీ కొత్త రాజ్యసభ సభ్యులకు ప్రధాని మోదీ హితవు

02



## ప్రభుత్వంపై ప్రెషర్ గ్రూప్‌గా ఉంటాం

- అదే దేశానికి అవసరం
- న్యాయ వ్యవస్థ, ఎన్నికల సంఘంపై ప్రజలకు నమ్మకం పోయింది
- రాజకీయ పార్టీల పరిస్థితి దారుణం
- ఒక పార్టీకి ఓటేస్తే.. అధికారంలోకి మరో పార్టీ
- అందుకే మా ఉద్యమానికి దేశవ్యాప్త మద్దతు
- జవాబుదారీతనం కోసం అన్ని సమస్యలపై పోరాటం చేస్తాం: సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే

ఛత్రపతి సంభాజీనగర్:

కార్కోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రస్తుతం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే సమూహంగా పనిచేస్తుందని దాని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే బుధవారం స్పష్టం చేశారు. ప్రస్తుతం భారతదేశానికి అవసరమైనది ఒత్తిడి సమూహమేనని ఆయన అన్నారు. మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లో కార్కోచ్ జనతా పార్టీ కోర్ టీమ్ సమావేశానికి ముందు విలేకరులతో మాట్లాడుతూ మీడియా, న్యాయవ్యవస్థ,

-మిగతా 2 లో








## 22ఏ భూముల పేరుతో అన్యాయం జరగదు

- ఒక్క సెంటు భూమినీ నిషేధిత జాబితాలో చేర్చలేదు
- అర్హుల హక్కులను కాపాడుతూనే ప్రభుత్వ భూముల పరిరక్షణ
- దరఖాస్తులు, ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి
- కలెక్టర్లకు మంత్రి పొంగులేటి ఆదేశం

హైదరాబాద్

రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల విషయంలో ఏ పేదవాడికీ, నిజమైన భూహక్కుదారుడికీ అన్యాయం జరగకుండా చూడటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. అర్హులైన వారి హక్కులను కాపాడుతూనే ప్రభుత్వ భూములను పరిరక్షిస్తామని తెలిపారు. ఒక్క సెంటు భూమిని కూడా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చలేదని వివరించారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేయాలనే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి ఎన్నడూ లేదనీ, వివాదాలు లేని ప్రయివేట్ భూములను నిషేధిత జాబితాలో చేర్చిందన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. బుధవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయంలో క్యూర్ పరిధిలోని 22ఏ నిషేధిత భూములకు సంబంధించి మంత్రి ఉన్నతస్థాయి సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ క్యూర్ పరిధి జిల్లాలకు సంబంధించిన అంశమైనా ఇందులో ఇచ్చిన ఆదేశాలు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు,

-మిగతా 2 లో

# ప్రజల గడపకే ప్రజా ప్రభుత్వం

మొదటి తరువాయి

అధికారులతో అక్కడికక్కడే ఫోన్లో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని స్పష్టం చేశారు. సమస్యలను వినడమే కాకుండా వాటి పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని అధికారులకు సూచించారు. ధరణి అమలులో జరిగిన అక్రమాల కారణంగా తమ భూములు ఇతరులు ఆక్రమించుకున్నారని, రాత్రికి రాత్రే పట్టాదారు పాస్ పుస్తకాల్లో మార్పులు జరిగాయని పలువురు బాధితులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ఇళ్లు రాకపోయినా అర్హులైన కుటుంబాలు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరగా, పోలీసు నియామకాల్లో వయోపరిమితి పెంచాలని యువత విజ్ఞప్తి చేసింది. గత ప్రభుత్వ హయాంలో రాజకీయ కక్షలతో నమోదు చేసిన పోలీసు కేసులను ఎత్తివేయాలని పలువురు వినతిపత్రాలు సమర్పించారు. అటవీ శాఖ అధికారుల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తమ హక్కులను పరిరక్షించాలని కోరుతూ పలువురు గిరిజనులు, అటవీ ప్రాంతాల ప్రజలు కూడా మంత్రి సీతక్కకు వినతిపత్రాలు అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో అన్యాయానికి గురైన వివిధ వర్గాలకు న్యాయం చేయాలని పెద్ద సంఖ్యలో ప్రజలు కోరారు. ఈ అంశాలపై సానుకూలంగా స్పందించిన మంత్రి సంబంధిత శాఖల అధికారులతో వెంటనే ఫోన్లో మాట్లాడి చట్టబద్ధంగా సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆ తర్వాత మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలుగా గత ప్రభుత్వం వదిలేసిన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తోందని మంత్రి సీతక్క తెలిపారు. ప్రజలు ప్రజా ప్రభుత్వంపై ఉంచిన విశ్వాసంతోనే రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చి తమ వినతులను అందజేస్తున్నారని చెప్పారు. ప్రతి వినతిని బాధ్యతగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రతి అర్జీపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులకు మంత్రి సీతక్క ఆదేశించారు. ప్రజల సమస్యలను వినడమే కాకుండా వాటికి శాశ్వత పరిష్కారం చూపడం ప్రజా ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా ప్రతి అర్జీదార్కి న్యాయం జరిగే వరకు ప్రభుత్వం బాధ్యతగా పనిచేస్తుందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

# రాళ్లు రువ్వినా.. అహింసే మార్గం!

- యువత మాట వినండి
- వారిని కూల్ చేయండి
- మాట వినడమే అతి పెద్ద ఆయుధం
- రాళ్లు విసురుతున్న యువతకు కౌన్సెలింగ్ చేయండి.. తద్వారా వారిని శాంతింపచేయండి
- భద్రతా బలగాలు సంయమనం పాటించాలి
- శాంతియుత నిరసనలను ప్రోత్సహించాలి
- పోలీసులకు ఇవి తెలిసిన జాగ్రత్తలే
- జంతర్‌మంతర్ అల్లర్ల కేసులపై సుప్రీం కోర్టు హితవు



**న్యూఢిల్లీ:**

యువతను శాంతింపజేయాలని, వారు లేవనెత్తే అంశాలను వినాలని సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. ఇటీవల జంతర్‌మంతర్‌లో విద్యార్థి నిరసనల నుంచి ఉత్పన్నమైన అల్లర్ల కేసుల ఉపసంహరణకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌పై బుధవారం విచారణ చేపట్టిన సందర్భంగా పరిస్థితి నియంత్రణ తప్పకుండా ఉండేందుకు భద్రతా బలగాలు కూడా చాలా సంయమనం పాటించాలని పేర్కొన్నారు. అహింస ప్రాధాన్యతను నొక్కి చెబుతూ యువతను శాంతింపజేయాలని అన్నారు. అత్యంత శక్తివంతమైన సాధనం వినడమేనని, వారి మాటలు వినాలని చెప్పారు. కొందరు దారితప్పినవారు రాళ్లు విసురుతున్న యువతను ఇంకా శాంతింపజేయాలి, వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని చీఫ్ జస్టిస్ హితవు చెప్పారు. వారికి సలహా, కౌన్సెలింగ్ అవసరం. శక్తివంతమైన ప్రభుత్వం పేరుతో ముందు సాగితే, మరోవైపు నుంచి వచ్చే దూకుడు పరిస్థితిని అనవసరంగా మరింత దిగజార్చి, మరిన్ని హింసాత్మక సంఘటనలకు దారితీయవచ్చు. దాన్ని నివారించాలని సూచించారు. ప్రశాంతమైన నిరసనలను ప్రోత్సహించాలని, అల్లర్లు జరిగితే పోలీసులు చాలా సంయమనం పాటించాలని సలహా ఇచ్చారు. యువత హింసాత్మకంగా ప్రవర్తించకుండా వారితో జాగ్రత్తగా వ్యవహరించాలని అన్నారు. వారికి సలహా ఇచ్చి శాంతింపజేయడమే మంచి మార్గం. అత్యంత శక్తివంతమైన సాధనం వినడం. వారు ఎందుకు అరుస్తున్నారో అర్థం చేసుకోవాలని చీఫ్ జస్టిస్ సూచించారు.

# 8 సెకన్ల లోపే నిద్రలోకి జారుకుంటా!

- రోజుకు మూడున్నర గంటలు మాత్రమే నిద్రపోతా
- క్రమం తప్పకుండా యోగా చేస్తా
- ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించండి
- సోషల్ మీడియాలో చురుగ్గా ఉండండి
- ఢిల్లీ రాజకీయాల వలలో చిక్కుకోవద్దు
- లెటర్ హెడ్ వాడకంలో జాగ్రత్త
- మీడియాతో మాట్లాడేటప్పుడు బీ కేర్‌ఫుల్
- బీజేపీ కొత్త రాజ్యసభ సభ్యులకు ప్రధాని మోడీ హితవు



న్యూఢిల్లీ

నిద్రకు ఉపక్రమించిన 8 సెకన్లలోనే తనకు నిద్ర పట్టేస్తుందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. బుధవారం న్యూఢిల్లీలోని తమ నివాసంలో బీజేపీకి చెందిన సుమారు 37 మంది కొత్తగా ఎన్నికైన, ఇతర పార్టీల నుంచి బీజేపీలో చేరిన రాజ్యసభ సభ్యులతో అల్పాహార సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్ నుంచి ఇటీవల చేరిన నాయకులు కూడా పాల్గొన్నారు. ప్రధానమంత్రి ఈ సమావేశంలో రాజకీయ తత్వం, సభా నైతికత, వ్యక్తిగత ప్రవర్తన గురించి వారికి మార్గనిర్దేశం చేశారు. విశ్వసనీయ వర్గాల ప్రకారం ఈ సమావేశం అత్యంత సుహృద్భావ వాతావరణంలో జరిగింది. తాను రోజుకు కేవలం మూడున్నర గంటలు మాత్రమే నిద్రపోతానని, కానీ ప్రతిరోజూ యోగా చేస్తానని, అది పని సామర్థ్యాన్ని పెంచుతుందని ప్రధాని తెలిపారు. సభ్యులు కూడా ఆరోగ్యకరమైన జీవనశైలి అవలంబించాలని ప్రతిరోజూ యోగా చేయాలని సూచించారు. ఢిల్లీ రాజకీయ వలయంలో చిక్కుకోవద్దని హెచ్చరించారు. ఢిల్లీలో ఎవరితో కలుస్తున్నారో ఎవరితో కూర్చుంటున్నారో జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. లెటర్ హెడ్ వాడకం, మరియు స్వీయ ప్రవర్తనపై చాలా జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. సామాజిక మాధ్యమాలు, టీవీ ఛానెళ్లతో కూడా అత్యంత జాగ్రత్తగా ఉండాలని ప్రధానమంత్రి సలహా ఇచ్చారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాల్లో చురుకుగా ఉండాలని, యువతతో మమేకం కావాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రచారం చేయాలని, యువతను క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని సలహా ఇచ్చారు. ప్రధానమంత్రి కార్యనిర్వహణ విధానం గురించి సభ్యులు అడిగినప్పుడు తాను ప్రస్తుత కాలంలోనే ఉంటానని మోడీ సమాధానమిచ్చారు. ప్రస్తుతం మీతో మాట్లాడుతున్నాను కాబట్టి ఇక్కడే ఉన్నాను ఇంకేమీ ఆలోచించడం లేదని అన్నారు. ప్రస్తుతంలోనే ఉండి దేశం మెరుగైన భవిష్యత్తు కోసం పని చేయాలని సలహా ఇచ్చారు.

# జిల్లా అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

మొదటి తరువాయి

పూర్తి చేస్తామన్నారు. బీహార్‌లోని బంకీపూర్‌లో ఓటమి మోడీ పతనానికి నాంది అని తెలిపారు. రాష్ట్రంలో కేటీఆర్ పాదయాత్ర వల్ల ఒరిగేదేమీ లేదని, ఆ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. లింబాద్రిగుట్ట పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 80 శాతం సీట్లు సాధించడం ఖాయమని తెలిపారు. భారీ వర్షాల వల్ల ప్రాజెక్ట్ పనులకు జాప్యం జరుగుతుందని, దీనికి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కాళేశ్వరం రివర్స్ పంపింగ్ ద్వారా 2 లక్షల ఎకరాలకు నీరు అందుతుందన్న కేటీఆర్‌పై మహేశ్‌కుమార్‌గౌడ్ మరోసారి ఫైర్ అయ్యారు. డ్యామ్ సేఫ్టీ అధికారులు నీరు నిల్వదని చెప్పినా, పనులు చేపట్టడం కేవలం కమిషన్ల కోసమేనని ఆరోపించారు. ప్రాజెక్టంతా లోపభూయిష్టంగా జరిగిందని, లక్షల కోట్ల రూపాయలు గోదావరి పాలు చేశారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం డ్యామ్ సేఫ్టీ అధికారుల సూచన మేరకే పనులు చేపడుతున్నట్టు స్పష్టం చేశారు. పార్టీ కోసం కష్టపడిన వారికే నామినేటెడ్ పదవులు దక్కుతాయన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కాట్పల్లి నగేష్‌రెడ్డి, నగర మేయర్ కూరగాయల ఉమారాణి, బొబ్బిలి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో మరింత ఉధృతం

- భారత్‌లో తగ్గనున్న రుతుపవన వర్షాలు
- మధ్య, దక్షిణ భారతంలో తేమ కొరత
- అస్సాంలో వరదలు.. పలు ప్రాంతాల్లో కరువు ముప్పు
- నిప్పుల కొలిమిగా మారిన ఐరోపా
- ఫ్రాన్స్‌లో కార్చిచ్చులు.. లక్షల మంది నిరాశ్రయులు
- యూరప్‌లో రికార్డు స్థాయి అగ్నిప్రమాదాలు
- అమెరికాను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న వడగాలులు
- ప్రపంచాన్ని వణికిస్తున్న ఎల్‌నినో ప్రభావం
- డబ్ల్యూఎంఓ హెచ్చరికతో అప్రమత్తమైన దేశాలు



**న్యూఢిల్లీ,**

సూపర్ ఎల్ నినో ప్రభావం రానున్న నెలల్లో మరింత ఉధృతం కానున్నది. ఆగస్టులో ఉష్ణోగ్రతలు మరింత తీవ్రమై అక్టోబర్ వరకు కొనసాగుతాయని నిపుణులు తెలిపారు. రానున్న వారాల్లో ఎల్ నినో తీవ్రతరం కావడంతో ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయని ఐక్యరాజ్యసమితి ప్రపంచ వాతావరణ సంస్థ(డబ్ల్యూఎంఓ) పేర్కొంది. భారత్‌లో ఈ రుతుపవన కాలంలో వర్షపాత తీరును ప్రభావితం చేసే ప్రధాన కారకం ఎల్ నినో. రుతుపవన వర్షపాతం దీర్ఘకాల సగటు(ఎల్‌పీఏ)లో సుమారు 92 శాతంగా ఉంటుందని అంచనా వేసింది. ఇది సాధారణం కంటే తక్కువ వర్షపాతం ఉండే సీజన్‌ను సూచిస్తున్నది. మధ్య, దక్షిణ ద్వీపకల్ప ప్రాంతాలు, వాయువ్య భారత్‌లోని కొన్ని భాగాలు తేమ కొరత ప్రమాదంలో ఉన్నాయి. ఈశాన్యంలోని అస్సాం గత కొన్నేండ్లలో ఎన్నడూ లేని విధంగా తీవ్రమైన వరదలతో పోరాడుతున్నది.

నిప్పుల కొలిమిలా ఐరోపా

ఎల్ నినో ప్రభావంతో ఐరోపా ఇప్పటికే అనేక వడగాలులను చవిచూసింది. భారత్‌లో రుతుపవన చక్రం దెబ్బతినగా ప్రపంచంలోని అనేక ఇతర ప్రాంతాలు తీవ్ర ఉష్ణోగ్రతలను ఎదుర్కొంటున్నాయి. రానున్న రోజుల్లో దీని ప్రభావం మరింత ఉగ్రరూపం దాల్చనున్నది. ఎల్ నినో కేవలం మన గుమ్మం వద్దే లేదు. అది మన ఇంటి లోపలకు వచ్చి ఉష్ణోగ్రతలను పెంచుతున్నది అని యూఎన్ సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ అన్నారు. ఇది కేవలం ఆరంభం మాత్రమే అని హెచ్చరించిన ఆయన ఎల్ నినో మరింత బలపడుతున్నది. ఇప్పటికే అధిక ఉష్ణోగ్రతలు, వినాశకరమైన కార్చిచ్చులు, రికార్డు స్థాయి సముద్రపు వేడితో అట్టుడికిపోతున్న భూమికి ఇది మరింత ఆజ్యం పోస్తున్నది అని పేర్కొన్నారు. ముఖ్యంగా ఐరోపా అంతా ఒక నిప్పుల కొలిమిలా మారిపోయింది. ఫ్రాన్స్‌లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పెద్ద ప్రాంతాలను కార్చిచ్చులు చుట్టుముట్టాయి. బోర్డోలో చెలరేగిన ఒక భారీ అగ్నిప్రమాదం కారణంగా మెరుపులు, ఉరుములతో నిండిన ఒక మేఘం ఏర్పడింది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత అత్యంత తీవ్రమైన అగ్నిప్రమాద సంక్షోభంగా పేర్కొంటూ ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రాన్ అత్యవసర పరిస్థితిని ప్రకటించడంతో 2 లక్షల మందికి పైగా ప్రజలు తమ ఇండ్లను వదిలి వెళ్లాల్సి వచ్చింది. డెన్మార్క్, జర్మనీ, పోలాండ్ దేశాలు కూడా అత్యధిక ఉష్ణోగ్రతలను నమోదు చేశాయి. జూలై చివరి నాటికి యూరోపియన్ యూనియన్ వ్యాప్తంగా 4.35 లక్షల హెక్టార్లకు పైగా భూమి అగ్నికి ఆహుతైంది. దీంతో ఇది రికార్డు స్థాయిలో అత్యంత తీవ్రమైన అగ్ని ప్రమాద కాలాలలో ఒకటిగా నిలిచింది.

మండుతున్న అమెరికా

అమెరికాలో కూడా అధిక ఉష్ణోగ్రతలు, వేడి పరిస్థితులు నెలకొన్నాయి. ఉటాలోని సాల్ట్ లేక్ సిటీలో ఉష్ణోగ్రతలు 42.8 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకున్నాయి. ఉత్తర కరోలినాలో ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల సెల్సియస్‌కు చేరాయి. పశ్చిమ, గ్రేట్ ప్లెయిన్స్ ప్రాంతాలను తీవ్రమైన వడగాలులు చుట్టుముట్టగా దక్షిణ, మధ్య ప్రాంతాలలో ఈ సీజన్ ఆరంభంలోనే తీవ్రమైన కరువు ఏర్పడింది. కొలరాడో, ఇడాహూ, మోంటానా, నెవాడాలలో వేసవిలో పిడుగుపాట్లు, అగ్నిప్రమాదాలు సంభవించాయి.

# పర్మిషన్లు ఇవ్వండి ప్లీజ్!

మొదటి తరువాయి

అంశాన్ని సానుకూలంగా పరిశీలిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. గతంలో తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్రాల మధ్య పరస్పర ఒప్పందం కుదిరిందని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అయితే మారిన పరిస్థితులు, సాంకేతిక అవసరాల నేపథ్యంలో బ్యారేజీ ఎత్తును 152 మీటర్ల వరకు పెంచే అవకాశంపై పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సెంటర్ సమగ్ర అధ్యయనం నిర్వహించిందని ఆయన వివరించారు. జబ్ల్యూ-సా అధ్యయన నివేదిక ప్రకారం 148 మీటర్ల ఎత్తులోనైనా, 152 మీటర్ల ఎత్తులోనైనా ముంపు ప్రభావంలో గణనీయమైన తేడా లేదని స్పష్టమైందని ముఖ్యమంత్రి తెలిపారు. ముంపు ప్రభావంలో సుమారు 50 శాతం భాగం నదీ గర్భంలోనే పరిమితమవుతుందని ఆ అధ్యయనం తేల్చిందని ఆయన కేంద్ర మంత్రికి వివరించారు. ఈ నేపథ్యంలో ముంపు సమస్యను అధిగమించవచ్చని, సాంకేతికంగా ఎత్తు పెంపుకు పెద్ద అడ్డంకులు లేవని ఆయన అభిప్రాయపడ్డారు. అదే సమయంలో 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మిస్తే గ్రావిటీ ఆధారిత నీటి సరఫరా సాధ్యం కాదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గ్రావిటీ ద్వారా నీటి సరఫరా సాధ్యమైతేనే దీర్ఘకాలికంగా ప్రాజెక్టు ప్రయోజనాలు సమర్థవంతంగా అందుతాయని ఆయన పేర్కొన్నారు. అందువల్ల 150 నుంచి 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేలా కేంద్ర జల్‌శక్తి శాఖ చొరవ తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ ఎత్తు పెంపుతో గ్రావిటీ ఆధారిత నీటి సరఫరా సాధ్యమవుతుందని, దీని ద్వారా విద్యుత్ వినియోగంపై పడే అదనపు భారం గణనీయంగా తగ్గుతుందని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. ఇది ప్రాజెక్టు ఆర్థిక సామర్థ్యాన్ని పెంచడమే కాకుండా దీర్ఘకాలిక నిర్వహణ వ్యయాన్ని కూడా తగ్గిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్రాల మధ్య త్వరితగతిన ఉన్నత స్థాయి సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. రెండు రాష్ట్రాల మధ్య సమన్వయం సాధించి, సాంకేతిక, పరిపాలనా అంశాలపై స్పష్టత తీసుకురావడం ద్వారా ప్రాజెక్టు అమలును వేగవంతం చేయవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు పూర్తయితే వెనుకబడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు విస్తృత స్థాయిలో సాగునీటి సౌకర్యం అందుబాటులోకి వస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు. ఇది ప్రాంతీయ అభివృద్ధికి కీలక మలుపు అవుతుందని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ రంగం బలోపేతం కావడంతో పాటు రైతుల జీవనోపాధి మెరుగుపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ మాట్లాడుతూ ప్రధానమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన లేఖ తమకు అందిందని ధృవీకరించారు. ఈ అంశాన్ని ప్రాధాన్యతతో పరిశీలిస్తామని ఆయన తెలిపారు. ముందుగా కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్రాల అధికారులతో సాంకేతిక చర్చలు ప్రారంభిస్తామని ఆయన వెల్లడించారు. అనంతరం రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ మంత్రుల స్థాయిలో సమావేశం నిర్వహించి, సమస్యకు సమగ్ర పరిష్కారం కనుగొనే దిశగా చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. అన్ని సంబంధిత అంశాలను సమన్వయంతో పరిశీలించి ముందుకు సాగుతామని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన పలువురు ఎంపీలు పాల్గొన్నారు. అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, డాక్టర్ మల్లు రవి, రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, డాక్టర్ కడియం కావ్య తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. అలాగే ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఈ. శ్రీధర్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన ఈ ప్రాజెక్టుపై కేంద్ర, రాష్ట్ర స్థాయిలో సమన్వయంతో ముందుకు సాగాలని సమావేశంలో అభిప్రాయం వ్యక్తమైంది.

# బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్తా..

మొదటి తరువాయి

అప్పటినుంచి ఆమె ఒకట్రెండు సార్లు మినహా మీడియాతో కూడా మాట్లాడలేదు. తాజాగా బుధవారం వర్చువల్‌గా మీడియాతో సమావేశమయ్యారు. పలు మీడియా సంస్థలతో మాట్లాడారు. ఈ మేరకు ఆమె వ్యాఖ్యలకు సంబంధించి ఆడియో సహా ప్రకటన విడుదలైంది. దీని ప్రకారం.. బంగ్లాదేశ్ వెళ్తానని ఆమె స్పష్టం చేశారు. “బంగ్లాదేశ్ ప్రజల కోసం జీవితమంతా గడిపి.. ఆ దేశం నుంచి బహిష్కరించిన వ్యక్తిగా మట్లాడుతున్నా. నేను నా దేశం, ప్రజల నుంచి వేరుకాలేదు. నేను బంగ్లాదేశ్ తప్పకుండా తిరిగి వెళ్తా. నేను వెళ్లేది అధికారం కోసం కాదు. బంగ్లాదేశ్‌ను సరైన దారిలో పెట్టేందుకే. అభివృద్ధి, లౌకికవాదం దిశగా నడిపించేందుకే. వాళ్లు నన్ను జైల్లో పెడతారు.. లేదా చంపుతారు అని కూడా తెలుసు. వాటికి నేను భయపడటం లేదు. నా కర్తవ్యాన్ని అవి ఆపలేవు. 2024 జూలై, ఆగస్టులో జరిగిన విద్యార్థి ఉద్యమం శాంతియుతమైనది కాదు. ప్రారంభం నుంచి విద్యార్థుల ఉద్యమాన్ని చర్చలు, చట్టపరమైన అంశాలు, సహనంతో పరిష్కరించేందుకు మా ప్రభుత్వం ప్రయత్నించింది. కానీ, సంస్కరణల పేరుతో చేపట్టిన విద్యార్థుల ఉద్యమాన్ని కొన్ని సంఘాలు హింసాత్మకంగా మార్చి, తమ రాజకీయ పావుగా వాడుకున్నాయి. ఇది ప్రణాళిక ప్రకారం చేసిన ఒక ఉద్యమం. ఉన్నట్లుండి జరిగింది కాదు. ఈ విషయాన్ని ముహమ్మద్ యూనస్ కూడా చెప్పాడు. కొంతమంది ఆదేశాలకు అనుగుణంగా జరిగింది. బ్యాలెట్ బాక్స్‌కు అతీతంగా అధికారం చేజిక్కించుకునేందుకు సాగిన ఉద్యమం” అని షేక్ హసీనా విమర్శించారు. గత రెండేళ్లుగా జరిగిన పరిణామాలు చూస్తుంటే తనకు ఆవేదన కలిగిందన్నారు. తాము ఎన్నో ఏళ్లుగా నిర్మించిన బంగ్లాదేశ్ ఇబ్బందుల్లో ఉందని, దీనికోసమా 1972లో 30 లక్షల మంది త్యాగం చేశారు అంటూ హసీనా ఆవేదన వ్యక్తం చేశారు.

# 22ఏ భూముల పేరుతో అన్యాయం జరగదు

మొదటి తరువాయి

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు.

ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా పనిచేయాలి

22ఏ అంశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలు, సూచనలకు అనుగుణంగా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని అధికారులు పూర్తిగా అర్థం చేసుకుని అదే స్ఫూర్తితో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. అర్హులైన వ్యక్తికి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత. అదే సమయంలో ప్రభుత్వ భూములను కాపాడటం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత అని అన్నారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములను సమగ్రంగా పరిశీలించి, చట్టబద్ధంగా, నిబంధనల మేరకు అర్హత ఉన్న భూములను గుర్తిస్తూ, ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కేసును వాస్తవాలు, రికార్డులు, చట్టపరమైన అంశాల ఆధారంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు.

22ఏకు సంబంధించిన దరఖాస్తులు, ఫిర్యాదులు ఏ స్థాయిలో వచ్చినా పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని మంత్రి కోరారు. తహశీల్దార్, ఆర్డీవో, సబ్ కలెక్టర్, జిల్లా కలెక్టర్ స్థాయిలో వచ్చే ప్రతి దరఖాస్తునూ సమగ్రంగా పరిశీలించి అర్హులైన వారికి న్యాయం చేయాలని సూచించారు. ప్రజావాణిలో ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను కూడా ప్రత్యేక దృష్టి సారించి, వెంటనే విచారణ పూర్తి చేసి విధిగా పరిష్కరించాలని ఆదేశించారు.

22ఏ భూములకు సంబంధించిన వివాదాల పరిష్కారానికి హైకోర్టు నిర్దేశించిన 45 రోజుల గడువులోనే అన్ని ప్రక్రియలనూ పూర్తి చేసి తుది నిర్ణయం తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. 22ఏకు సంబంధించిన కేసుల్లో కోర్టు ఆదేశాలను పరిగణనలోకి తీసుకుని పరిష్కరించాలని ప్రజలకు న్యాయం జరిగేలా వ్యవహరించాలని సూచించారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించడం ప్రభుత్వ ప్రథమ బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములపై అక్రమ లావాదేవీలు, అక్రమ రిజిస్ట్రేషన్లు, ఆక్రమణలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

# ప్రభుత్వంపై ప్రెషర్ గ్రూప్‌గా ఉంటాం

మొదటి తరువాయి




వర్గ వంటి సంస్థలపై ప్రజల విశ్వాసం తగ్గుతున్న అంశంపై చర్చలు జరుగుతాయి. ఇథనాల్ మిశ్రిత ఇంధనం, పెరుగుతున్న నిరుద్యోగం వంటి అంశాలను కూడా సమావేశంలో చర్చిస్తామని ఆయన చెప్పారు.

ఉద్యమానికి దేశవ్యాప్త మద్దతు

న్యాయవ్యవస్థ, రాజకీయ వ్యవస్థ, మీడియా, ఎన్నికల సంఘంపై ప్రజలు విశ్వాసం కోల్పోయారు. మా ఉద్యమానికి దేశవ్యాప్త మద్దతు లభించింది. ఉద్యమం పెరిగే కొద్దీ మద్దతు కేవలం విద్యా అంశాలకు మాత్రమే పరిమితం కాలేదు. ఈ సంస్థలకు సంబంధించింది కూడా అయింది. కాబట్టి ఈ సంస్థల్లో జవాబుదారీతనం తీసుకురావడానికి ప్రభుత్వంపై ఒత్తిడి చేసే సమూహం అవసరం ఉందని దీప్కే అన్నారు.

దారుణంగా రాజకీయ పార్టీలు

రాజకీయ పార్టీల పరిస్థితి చాలా దారుణంగా ఉంది. ఉదయం ఒక పార్టీకి ఓటు వేస్తే సాయంత్రం మరొక పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తోంది అని సీజేపీ చీఫ్ వ్యాఖ్యానించారు. సీజేపీకి మార్గదర్శకుడిగా సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ కొనసాగుతారని తెలిపారు. కీలక అంశాలపై ఆయన సలహా తీసుకుంటామని అన్నారు. ఇటీవల నీట్ పేపర్ లీక్, ఇతర పరీక్షల అక్రమాలకు వ్యతిరేకంగా కార్రోచ్ జనతా పార్టీ నాయకత్వంలో జరిగిన నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన ఎఫ్‌ఐఆర్‌లను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతామని కూడా ఆయన చెప్పారు.

మా కుటుంబానికి రక్షణ లేదు: సీజేపీ సౌరవ్ దాస్

బుధవారం తన ఇంట్లోకి కొందరు యూట్యూబర్లు, మీడియా ఛానెళ్ల ప్రతినిధులు చొరబడ్డారని కార్రోచ్ జనతా పార్టీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ ఆరోపించారు. ఇది తన గోప్యతకు ఉల్లంఘన మాత్రమే కాకుండా కుటుంబానికి తీవ్రమైన భద్రతా ముప్పు అని ఆయన పేర్కొన్నారు. నిన్న రాత్రి నుంచి కొందరు ఇంటి బయట గుడారం వేసుకుని ఉన్నారు. ఈరోజు ఉదయం 15 నుంచి 20 మంది నా ఇంటి వద్దకు చేరుకున్నారు. ఇంట్లో ఉన్న ప్రతి ఒక్కరికి తీవ్రమైన భద్రతా ముప్పు ఏర్పడింది. నేను ప్రస్తుతం కార్రోచ్ జనతా పార్టీ రెండు రోజుల సమావేశం కోసం మహారాష్ట్రలో ఉన్నాను అని ఎక్స్‌లో చేసిన పోస్టులో దాస్ పేర్కొన్నారు.

# ఆస్టర్ డీఎం క్వాలిటీ కేర్‌కు బలమైన ఆరంభం



**హైదరాబాద్, ఆగస్టు 5 నవ సంఘర్షణ**
ఆస్టర్ డీఎం క్వాలిటీ కేర్ లిమిటెడ్ 2026–27 తొలి త్రైమాసికంలో 20 శాతం ఆదాయ వృద్ధితో రూ.2,597 కోట్లు, 30 శాతం నిర్వహణ లాభం వృద్ధితో రూ.576 కోట్లు నమోదు చేసిందని సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ అజాద్ మూఫెన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎండీ, గ్రూప్ సీఈఓ వరుణ్ ఖన్నా తోకలసి ఆయన మాట్లాడుతూ జూలై 1 నుంచి అమల్లోకి వచ్చిన ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ – క్వాలిటీ కేర్ విలీనంతో 28 నగరాల్లో 10,800కు పైగా పడకలతో సేవలు అందిస్తున్న సంస్థ అన్నారు. భవిష్యత్తులో 15 వేల పడకలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఈ విలీనం కీలక మైలురాయి అని పేర్కొన్నారు. తొలి త్రైమాసికంలో సుమారు 20 లక్షల మంది రోగులకు సేవలు అందించామని తెలిపారు. ఆర్వోసీఈ 22.9 శాతానికి పెరగగా, కాసరగోడ్ ఆస్పత్రి తొమ్మిది నెలల్లోనే నిర్వహణ లాభం బ్రేక్‌ఈవెన్ సాధించిందని తెలిపారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఘనంగా గోరింటాకు పండుగ

**-సేవతో పాటు సంప్రదాయాల పరిరక్షణకు లయన్స్ క్లబ్ కృషి**

**- క్లబ్ అధ్యక్షురాలు డా.శరణ్య యాదవ్**



**రామగిరి,ఆగస్టు 5 నవ సంఘర్షణ**
ఆషాఢ మాసం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ ఆధ్వర్యంలో సెంటినరీకాలనీలోని సింగరేణి టీ 2 క్వార్టర్ లో నివాసం ఉంటే మహిళలతో కలిసి గోరింటాకు పండుగను ఘనంగా నిర్వహించారు.భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు ఉత్సాహంగా పాల్గొని ఒకరికొకరు గోరింటాకు పెట్టుకుని ఆషాఢ మాస విశిష్టతను చాటిచెప్పారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు డా.శరణ్య మారుతి యాదవ్ మాట్లాడుతూ,సమాజ సేవతో పాటు మన సంస్కృతి,సంప్రదాయాలను భావితరాలకు చేరవేయడం కూడా లయన్స్ క్లబ్ బాధ్యతగా భావిస్తోందన్నారు.మహిళల ఐక్యత, కుటుంబ విలువలు,సాంస్కృతిక వారసత్వాన్ని పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు.కార్యక్రమంలో గోరింటాకు అలంకరణ,సాంప్రదాయ ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పాల్గొన్న మహిళలకు శుభాకాంక్షలు తెలియజేసి అల్పాహారం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు,మహిళా సభ్యులు,స్థానిక మహిళలు,కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సుల్తానాబాద్ లో జరిగే ఏఐటీయూసీ పెద్దపలి జిల్లా 4వ మహాసభను జయప్రదం చేయండి

**ఉద్యోగ కార్మిక వర్గానికి ఏఐటీయూసీ జిల్లా ప్రెసిడెంట్ వైవి రావు జనరల్ సెక్రెటరీ కడారి సునీల్ పిలుపు**



**రామగిరి, ఆగస్టు 5 నవ సంఘర్షణ**
ఏఐటీయూసీ పెద్దపెల్లి జిల్లా నాలుగవ మహాసభలను సుల్తానాబాద్ కేంద్రంలో ఈ నెల 20వ తేదీన.యశోద నరహరి ఫంక్షన్ హాల్లో జరుగుతున్నాయని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వైవి రావు జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ తెలిపారు.ఈ మహాసభకు సిపిఐ జాతీయ నాయకులు ఉమ్మడి రాష్ట్రాల శాసనసభ ఫ్లోర్ లీడర్ కామ్రేడ్ చాడ వెంకట్ రెడ్డి.తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ కలవేన శంకర్.ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఎస్ బాలరాజు సిపిఐ జిల్లా కార్యదర్శి తాంత్ర సదానందం హాజరు అవుతున్నారు ఈ మహాసభలో గత కార్యక్రమాలను సమీక్షించుకొని భవిష్యత్ కార్యక్రమాలు రూపొందించుకోవడానికి మహాసభలో కార్మిక ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తీసుకోవలసిన ఉద్యమ రూప కల్పన జరుగుతుందని అన్నారు.ఈ మహాసభకు ఏఐటీయూసీ అనుబంధ సంఘాలు మధ్యాహ్న భోజనం ఆశ అంగన్వాడి హమాలి ఐకెపి రైస్ మిల్ గోదాం రైల్వే పోస్టల్ ఎల్ఐసి ఎన్టిపిసి ఆర్టీసీ సివిల్ సప్లై సంఘటిత అసంఘటిత కార్మిక వర్గం హాజరుకావాలని 20వ తేదీన 10 గంటలకు సుల్తానాబాద్ ఐబి నుండి మహాసభ ప్రాంగణం వరకు జరుగుతుందని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## సైబర్ నేరాల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి...



**ఆగస్టు 5 నవ సంఘర్షణకార్యాలయం:- ఆగస్టు 5.**
ప్రతి ఒక్కరికి సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలి..
మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్..
సురక్షా కా తిరంగా -- సైబర్ స్వతంత్ర తెలంగాణ" సైబర్ అవగాహన ప్రచార పోస్టర్లను ఆవిష్కరించి, మహబూబాబాద్ మెడికల్ కళాశాల మీటింగ్ హాల్ లో కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్..

# 15000 కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్స్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి...

**-బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,మాజీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి**



**రామగిరి,ఆగస్టు 5 నవ సంఘర్షణ**
ఫీజుల బకాయి బీజేపీ లడాయి కార్యక్రమంలో బుధవారం పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గం రామగిరి మండలం లోని జే ఎన్ టీ యూ కాలేజీ ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,మాజీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి సందర్శించి స్కాలర్షిప్ బకాయిల సమస్య గురించి అడిగి తెలుసుకొని బీజేపీ పార్టీ అన్ని విధాలుగా విద్యార్థులకి అండగా ఉంటుందని అన్నారు అనంతరం వారు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్,స్కాలర్‌షిప్ ఇకపై గోస బాధ్యతను మరచిన ప్రభుత్వం -- 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుకు అగమ్యగోచరం చేసింది సోయి లేని పాలనా లో విఫలమైన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం. "వన్ టైం సెటిల్‌మెంట్" పేరుతో హామీలను గాలిలో కలిపిన చేతకాని ప్రభుత్వం. పేదకుటుంబాల పిల్లలకు బకాయిలు,చెల్లించక విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకి గురి చేస్తుంది ఫీజులు చెల్లించలేక సంక్షోభంలో పడిన లక్షలాది మంది విద్యార్థులు ఉన్నప్పటికీ,సర్టిఫికెట్లు లేక ఉద్యోగాలు ఉన్నత చదువులకు దూరమవుతున్న తెలంగాణ విద్యార్థులు.సకాలంలో స్కాలర్‌షిప్స్ అందకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు అని అన్నారు బీజేపీ డిమాండ్లు రూ.15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి.ఫీజు బకాయిలు కారణంగా నిలిచిపోయిన సర్టిఫికెట్లు వెంటనే విడుదల చేయాలి.40 లక్షల విద్యార్థుల చదువులు,ఉద్యోగ అవకాశాలు దెబ్బతినకుండా తగిన చర్యలు తీసుకోవాలి.ప్రతి విద్యా సంస్థలోని నిరుపేద గడువులోపు చెల్లింపులు జరిగేలా,భవిష్యత్తులో బకాయిలు పేరుపోకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని సక్రమంగా అమలు చేయేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి.ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో ఇబ్బందుల్లో ఉన్న విద్యార్థులకు అత్యవసర ఆర్థిక ఉపశమనం కల్పించాలి. ఎస్ సి,ఎస్ టి,బి సి విద్యార్థుల భవిష్యత్తును కాపాడండి అన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ మండలల అధ్యక్షులు,వివిధ మండలాల నాయకులు, బీజేవైఎం నాయకులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## కోలాహలంగా పూలెకోన గీత పారిశ్రామిక సహకార సంఘం బోనాల సంబరాలు

**-పోతరాజుతో పాటు బోనాల సంబరాల్లో పూలెకోన గీత పారిశ్రామిక సహకార సంఘం ప్రతినిదులు**



**హైదరాబాద్, ఆగస్టు 5 నవ సంఘర్షణ**
ఆశాఢమాస అమ్మవారి బోనాల ఉత్సవాల జాతరతో గీత కార్మికులకు విడదీయరాని బంధం ఉందని పూలెకోన గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు కొత్త నవీన్ కుమార్ గౌడ్, ఉపాధ్యక్షుడు నిర్మల నీలకంఠంగౌడ్లు అభివర్ణించారు. గీత పారిశ్రామిక సహకార సంఘం పూలెకోన ఆధ్వర్యంలో ఆశాఢమాస అమ్మవారి బోనాల ఉత్సవాలను బుధవారం అంగరంగ వైభవోపేతంగా నిర్వహించారు. పురానాపూల్ కల్లు కంపౌండ్ ప్రాంగణంలో గల మైసమ్మ ఆలయంలో సంఘం అధ్యక్షుడు కొత్త నవీన్కుమార్ గౌడ్, ఉపాధ్యక్షులు నిర్మల నీలకంఠంగౌడ్, ప్రధానకార్యదర్శి బుర్ర భాస్కర్ గౌడ్ పర్యవేక్షణలో గీత కార్మికులు, గౌడ కులస్థులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారికి ఒడిబియ్యం నింపడంతో పాటు సంప్రదాయ బద్ధంగా పోతరాజు నృత్య విన్యాసాల మధ్య తొట్టెలను, బోనాలను మాతేశ్వరికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పోతరాజు నృత్య విన్యాసాలు, పలు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు, బోనాల జాతర గీతాలాపనలు అలరించి ఆకట్టుకున్నాయి. గౌడ కులస్థులు, గౌడ సహకార సంఘాల ప్రతినిదులు ఆటపాటలతో సందడిగా గడిపారు ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కొత్త నవీన్ కుమార్ గౌడ్, ఉపాధ్యక్షుడు నిర్మల నీలకంఠం గౌడ్, ప్రధానకార్యదర్శి బి.భాస్కర్ గౌడ్, జియాగూడ గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు బి.చంద్రశేఖర్ గౌడ్, ఉపాధ్యక్షుడు బి.అశోక్ గౌడ్, ప్రధానకార్యదర్శి ప్రవీణ్ గౌడ్, ప్రతినిదులు జి.మాణిక్యం గౌడ్, బి.అశోక్ గౌడ్, డి.మధుసూదన్ గౌడ్, కె.శ్రీనివాస్ గౌడ్, ఎన్.ప్రవీణ్ గౌడ్, ఎం.లింగంగౌడ్, సుధీర్ గౌడ్, ఎ.శ్రీనాథ్ గౌడ్, సంఘసేవకులు రాజేంద్ర ప్రసాద్ జైస్వాల్, గీతకార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మ తల్లికి బోనాలు సమర్పించిన గంగపుత్రులు





**మంథని, ఆగస్టు 5 నవ సంఘర్షణ**
ఆషాడ మాసంలో ప్రతి సంవత్సరం గంగ పుత్రుల కుల ఆరాధ్య దైవమైనటువంటి గంగమ్మకు ప్రతి సంవత్సరం బోనాలను సమర్పిస్తుంటారు. బుధవారం మంథని పట్టణంలోని బోయిన్ పేట్ నాగులమ్మ దేవాలయం నుండి శోభాయానంగా యాత్ర ప్రారంభమై డప్పు దరువులు, డీజే నృత్యాలతో కుల వృత్తి అయినటువంటి కలను ప్రదర్శనాత్మకంగా చూపిస్తూ గోదావరి నది వరకు యాత్ర చేపట్టారు. ఉద్యోగ రీత్యా వివిధ పట్టణాలు, గ్రామాల్లో స్థిరపడ్డ అటువంటి బెస్త కులస్తులు అందరూ ఒక చోటుకు చేరి బోనాల ఉత్సవాలను ఘనంగా జరిపి గంగమ్మ తల్లిని భక్తి, శ్రద్ధలతో పూజించి మొక్కులు చెల్లించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడి, పంటలు వృద్ధి చెంది ప్రజలను పిల్ల పాపలను చల్లగా చూడాలని వేడుకొంటూ అనంతరం అమ్మవారిని నీటిలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో మంథని మున్సిపాలిటీ ఓడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముసుకుల సహేందర్ రెడ్డి బిజెపి నాయకులు సునీల్ రెడ్డి, చల్ల నారాయణరెడ్డి, సామల అశోక్, బోయిని నారాయణ, అంబటి సత్తయ్య, మాదేశి పద్మ అధిక సంఖ్యలో గంగ పుత్ర నాయకులు సోదరులు, మహిళలు పాల్గొన్నారు..

# గంగారంలో ఘనంగా తల్లిపాలా వారోత్సవాలు





**ఆగస్టు 5 నవ సంఘర్షణ**
రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తోందని కిష్టంపేట సెక్టార్ పర్యవేక్షకురాలు మాధవి తెలిపారు. చెన్నూర్ మండలం గంగారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం లో ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహిస్తున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు-- 2026 కార్యక్రమాన్ని బుదవారం కిష్టంపేట సెక్టార్ పర్యవేక్షకురాలు మాధవి, గంగారం సర్పంచ్ కుడుదుల మల్లక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని బుదవారం కిష్టంపేట సెక్టార్ పర్యవేక్షకురాలు మాధవి మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన శిశువు జన్మిస్తాడని అన్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు ఐరన్, కాల్షియం, ప్రోటీన్లు సమృద్ధిగా ఉండే పోషకాహారాన్ని ఉచితంగా అందిస్తోందని తెలిపారు. బాలామృతం, పాలు, గుడ్లు, టేక్ హోమ్ రేషన్ కిట్లను ప్రతి నెలా అందజేస్తున్నామని, ప్రతి గర్భిణి, బాలింత వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిశువు జన్మించిన గంటలోపే ముర్రుపాలు తప్పనిసరిగా పట్టించాలని, తొలి ఆరు నెలల వరకు తల్లిపాలు తప్ప మరే ఇతర ఆహారం లేదా నీరు కూడా ఇవ్వకూడదని చెప్పారు. తల్లిపాలలో శిశువుకు అవసరమైన అన్ని పోషకాలు, వ్యాధి నిరోధక శక్తి పుష్కలంగా ఉంటాయని వివరించారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లి, బిడ్డల మధ్య అనుబంధం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. శిశువుకు ఆరు నెలలు నిండిన తర్వాత తల్లిపాలతో పాటు ఇంట్లో తయారు చేసిన మెత్తని సంపూరక ఆహారాన్ని అలవాటు చేయాలని, రెండు సంవత్సరాల వయస్సు వరకు తల్లిపాలు ఇవ్వడం కొనసాగించవచ్చని సూచించారు. అనంతరం అన్న ప్రాసన, అక్షర అభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో అంగన్ ఉపాధ్యాయులు కె. పి సరోజ, కె. సుజాత, జి. మల్లమ్మ, హెల్పర్స్ కె. మాలతీ, సి ఎచ్. నాగేశ్వరి, కిష్టంపేట సెక్టార్ అంగన్వాడీ ఉపాధ్యాయులు, సహాయకులు, బాలింతలు, గర్భిణీ లు, కిషోర బాలికలు, తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సారు జర మీ గిరిజన బంజారా పిల్లల గోడు వినండి

## -మీరు కూడా మా బంజారా ఎమ్మెల్యేనే



**అమృనాయక్ తండ,ఐదవ ఆగస్టు 5 నవ సంఘర్షణ**
రోడ్డు వసతి లేక ప్రతిరోజు బురదలో తప్పని ఈ తిప్పలు. పేరుకే మున్సిపాలిటీ కనీస వీధిలైట్లు రోడ్లు డ్రైనేజీ సదుపాయాలు నిల్ మరిపెడ ఐదవ వార్డ్ బోడ అమృ నాయక్ తండాలో పరిస్థితి. మీ కింది స్థాయి నాయకులకు పలుమార్లు ఎంత చెప్పినా ఉపయోగం లేదు.

# హైడ్రా కమిషనర్ సంతకమే ఫోర్జరీ విద్యా మాఫియాకు పరాకాష్ట

-దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి

-ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్ ఎ స్టాలిన్



**ఆగస్టు 5 నవ సంఘర్షణ హనుమకొండ**
కాకతీయ యూనివర్సిటీ: హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ ఎన్ఓసీ లతో ఇంటర్మీడియట్ బోర్డు గుర్తింపు పొందేందుకు ఇంటర్ బోర్డుకు సమర్పించిన 8 ప్రైవేట్ జూనియర్ కళాశాలల వ్యవహారం రాష్ట్ర విద్యా వ్యవస్థను కుదిపేసే అత్యంత తీవ్రమైన నేరమని, దోషులపై కఠిన చర్యలు తీసుకొని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్ ఎ స్టాలిన్ డిమాండ్ చేశారు. బుధవారం ఎన్ ఎ స్టాలిన్ పత్రిక ప్రకటన విడుదల చేస్తూ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారుల సంతకాలను నకిలీ చేసి అనుమతులు పొందే స్థాయికి విద్యా మాఫియా బరితెగించిందంటే ప్రభుత్వ పర్యవేక్షణ ఎంత దారుణంగా విఫలమైందో అర్థమవుతోందన్నారు. వేలాది మంది విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతూ నకిలీ పత్రాలతో కళాశాలలు నడపడం క్షమించరాని నేరమన్నారు. నకిలీ ధృవీకరణ పత్రాలు సమర్పించిన కళాశాలలపై కేవలం కేసు నమోదుతో సరిపెట్టకుండా ప్రభుత్వం మరియు విద్యాశాఖ కఠినంగా వ్యవహరించాలని, ఫోర్జరీకి పాల్పడిన 8 కళాశాలల గుర్తింపును తక్షణమే రద్దు చేసి, ఆ విద్యాసంస్థలను వెంటనే సీజ్ చేయాలని, ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితో స్వతంత్ర విచారణ జరిపించి, నకిలీ పత్రాల మాఫియాకు సహకరించిన అధికారులు, కళాశాల యాజమాన్యాలను చట్టం ముందు నిలబెట్టాలన్నారు. విద్యార్థుల భద్రత, విద్యా ప్రమాణాల విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల అనుమతులు, ఫైర్ ఎన్వోసీలు, భవన భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అక్రమాలకు పాల్పడిన ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకోవాలని, వెంటనే వాటి గుర్తింపును రద్దు చేసి, యాజమాన్యాలపై కఠిన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అదేవిదంగా అనుమానాస్పదంగా ఉన్న మిగతా 60 ప్రైవేట్ కళాశాలల ఫైర్ ఎన్ఓసీ లను కూడా సమగ్రంగా తనిఖీ చేసి, నివేదికను బహిర్గతం చేయాలని, రద్దయ్యే కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు నష్టపోకుండా, వారిని సమీపంలోని ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన ఇతర కళాశాలల్లో సర్దుబాటు చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫైర్ సేఫ్టీ మరియు నిబంధనల అమలుపై సమగ్ర భద్రతా ఆడిట్ నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ... తెలంగాణ ఆత్మకు చిరస్థాయి చిరునామా



**హైదరాబాద్; ఆగస్టు 5 నవ సంఘర్షణ**
చరిత్రను మార్చే వ్యక్తులు తరచుగా పుట్టరు. ఒకవేళ పుట్టినా, తమ జీవితాన్ని వ్యక్తిగత విజయాల కోసం కాకుండా సమాజ శ్రేయస్సు కోసం అంకితం చేసినవారే యుగపురుషులుగా నిలుస్తారు. అలాంటి అరుదైన మహనీయుల్లో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఒకరు. ఆయన జీవితం తెలంగాణకు అంకితమైన నిరంతర తపస్సు. ఆయన ఆలోచనలు ఒక ప్రాంత ఆకాంక్షలకు శాస్త్రీయ దృక్పథాన్ని అందించిన చైతన్య ప్రవాహం. తెలంగాణ ఉద్యమం గురించి మాట్లాడినప్పుడు చాలామంది వీధుల్లో జరిగిన పోరాటాలను గుర్తు చేసుకుంటారు. కానీ ప్రతి ఉద్యమానికి ఒక బలమైన తాత్విక పునాది అవసరం. ఆ పునాదిని నిర్మించిన మేధావి ప్రొఫెసర్ జయశంకర్. తెలంగాణ ప్రజలు ఎదుర్కొన్న సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ రంగాల అసమానతలను ఆయన భావోద్వేగాలతో కాదు, వాస్తవాలతో, గణాంకాలతో, చారిత్రక ఆధారాలతో విశ్లేషించారు. అందుకే ఆయన మాటలు నినాదాలుగా కాకుండా, అధ్యయనాలుగా నిలిచిపోయాయి. ఆయనకు తెలంగాణ అంటే కేవలం ఒక భౌగోళిక ప్రాంతం కాదు. అది ఒక చరిత్ర, ఒక సంస్కృతి, ఒక భాషా యాస, ఒక జీవన విధానం, ఒక ఆత్మగౌరవ ప్రతీక. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు రాజకీయ స్వరం రావడానికి ముందే, వాటికి మేధోస్వరాన్ని అందించిన వ్యక్తి జయశంకర్. ప్రజల సమస్యలను అర్థం చేసుకోవాలంటే ముందుగా వారి జీవితాన్ని అర్థం చేసుకోవాలని ఆయన నమ్మకం. విద్యావేత్తగా ఆయన చేసిన సేవలు కూడా విశిష్టమైనవే. తరగతి గదిలో పాఠాలు చెప్పిన గురువుగానే కాదు, సమాజానికి ఆలోచించడం నేర్పిన మార్గదర్శిగా ఆయన నిలిచారు. విద్య అనేది ఉద్యోగం సంపాదించడానికి మాత్రమే కాకుండా సమాజాన్ని చైతన్యవంతం చేయడానికి ఉపయోగపడాలని ఆయన బోధించారు. వేలాది మంది విద్యార్థుల్లో ఆయన నాటిన ఆలోచనా విత్తనాలు నేటికీ స్ఫూర్తినిస్తున్నాయి. జీవితాంతం ఆయన సరళతను, నిజాయితీని, నిబద్ధతను విడిచిపెట్టలేదు. అధికారాన్ని ఆశించలేదు. పదవులను లక్ష్యంగా పెట్టుకోలేదు. వ్యక్తిగత కీర్తి కోసం కాదు, ప్రజల గౌరవం కోసం జీవించారు. అందుకే ఆయన పేరు ఒక వ్యక్తి పేరుగా కాకుండా తెలంగాణ చరిత్రలో ఒక విలువగా నిలిచిపోయింది.నేటి సమాజంలో విభేదాలు వేగంగా పెరుగుతున్న ఈ కాలంలో ప్రొఫెసర్ జయశంకర్ జీవితం మనకు ఒక గొప్ప సందేశాన్ని అందిస్తుంది. సమస్యలను ద్వేషంతో కాదు, అధ్యయనంతో ఎదుర్కోవాలి. భావోద్వేగాలను రెచ్చగొట్టడం కంటే ప్రజల్లో చైతన్యం పెంచడం గొప్పది. వ్యక్తిగత ప్రయోజనాల కంటే సమాజ ప్రయోజనాలే శాశ్వతమని ఆయన తన జీవితంతో నిరూపించారు. జయంతులు, వర్ధంతులు కేవలం పూలమాలలు వేసే రోజులు కాదు. ఒక మహనీయుడు నడిచిన మార్గాన్ని మరోసారి గుర్తు చేసుకునే సందర్భాలు. ప్రొఫెసర్ జయశంకర్‌కు నిజమైన నివాళి అంటే ఆయన కలలు కన్న సమానత్వ సమాజ నిర్మాణానికి ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించడం. యువత పుస్తకాలను ఆయుధాలుగా, జ్ఞానాన్ని శక్తిగా, ప్రజాసేవను జీవిత లక్ష్యంగా స్వీకరించినప్పుడే ఆయన ఆశయాలకు సంపూర్ణ గౌరవం లభిస్తుంది. కాలం మారినా విలువలు మారవు. వ్యక్తులు దూరమైనా వారి ఆలోచనలు సమాజాన్ని నడిపిస్తూనే ఉంటాయి. తెలంగాణ అనే పదం వినిపించిన ప్రతిసారీ ప్రజల ఆత్మగౌరవం, చరిత్ర, సంస్కృతి, స్వాభిమానంతో పాటు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ పేరు కూడా చిరస్థాయిగా గుర్తుకు వస్తూనే ఉంటుంది. అదే ఆయన సాధించిన అజరామరమైన విజయగాథ. "ఒక ప్రాంతాన్ని ప్రేమించడం గొప్ప విషయం... ఆ ప్రాంత ప్రజల భవిష్యత్తు కోసం జీవితాంతం ఆలోచించడం మరింత గొప్ప విషయం. ఆ గొప్పతనానికి నిలువెత్తు నిదర్శనం ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్."

**డాక్టర్ కట్టా శేఖర్**
**అసిస్టెంట్ ప్రొఫెసర్**

# ఐఎన్టీయూసి కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం



**రామగిరి, ఆగస్టు 5 నవ సంఘర్షణ**
సెంటినరీ కాలనీలోని ఐఎన్టీయూసి కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ఐఎన్టీయూసి సెక్రటరీ జనరల్,మినిమమ్ వేజ్ బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,గత బీ ఆర్ ఎస్ ప్రభుత్వ వైఫల్యాల వల్లే నేడు సింగరేణి సంస్థ అనేక సమస్యలను ఎదుర్కొంటోందని విమర్శించారు.127 సంవత్సరాల చరిత్ర కలిగిన సింగరేణిని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించి సంస్థకు తీవ్ర నష్టం కలిగించారని ఆరోపించారు.కే సీ ఆర్ ప్రభుత్వం మరియు వారి కుటుంబం అన్ని విధాలుగా సింగరేణి ని దోచుకున్నారని అన్నారు.సింగరేణి కార్మికులకు పోరాటాలు కొత్త కాదని,తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన ఉద్యమాన్ని కార్మికులు ఎప్పటికీ మరువ రాదని పేర్కొన్నారు.మాయమాటలతో కంపెనీ యాజమాన్యంతో కుమ్మక్కై రాజకీయాలు చేస్తూ కార్మికుల జీవితాలను దెబ్బతీసిన వారిని కార్మికులు గుర్తుంచుకోవాలని అన్నారు. కోయగూడెం,సత్తుపల్లి బ్లాకులను కేంద్ర ప్రభుత్వంతో కుమ్మక్కై తమ అనుకూల సంస్థలకు అప్పగించిన విషయాన్ని కార్మికులు మరచిపోలేదన్నారు.అలాగే ఏఐటీయూసి గుర్తింపు సంఘంగా కార్మికుల సమస్యలను సమర్థంగా పరిష్కరించడంలో విఫలమైందని, కేవలం మాటలతో కార్మికులను మభ్యపెడుతోందని విమర్శించారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు,పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సింగరేణి అభివృద్ధి,కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు.కాంట్రాక్ట్ కార్మికులకు తొలిసారిగా రూ.5,000 బోనస్ అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు.గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన నైనీ బ్లాక్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కృషితో ఉత్పత్తి ప్రారంభమైందని,ప్రస్తుతం జైపూర్ ప్లాంట్‌కు బొగ్గు సరఫరా జరుగుతోందని తెలిపారు.అలాగే ప్రజా ప్రభుత్వ కృషితో కోయగూడెం,మందమర్రి బ్లాకుల కేటాయింపుకు పోరాడి సాధించడం సింగరేణి పట్ల ఐఎన్టీయూసి చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు.రాబోయే నాలుగు సంవత్సరాల్లో 12 నూతన గనుల ఏర్పాటు దిశగా కృషి చేస్తామని తెలిపారు. మార్ పేర్లు,సొంతింటి పథకం,మెడికల్ బోర్డు వంటి కార్మికుల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని,కార్మికుల హక్కులు,సంక్షేమం కోసం నిరంతరం పోరాడే ఏకైక సంఘం ఐఎన్టీయూసి అని జనక్ ప్రసాద్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అర్జీ--3 వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో సీనియర్ వైస్ ప్రెసిడెంట్లు నర్సింహారెడ్డి,ధర్మపురి,అర్జీ--1 వైస్ ప్రెసిడెంట్ సదానందం,అర్జీ--2 వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణ రెడ్డి,కేంద్ర కార్యదర్శులు గడ్డం తిరుపతి,ఎల్లంకి రామారావు,మడ్డి రాజకుమార్, బిక్ష నాయక్,బ్రాంచ్ కార్యదర్శులు సాయికృష్ణ, పిట్ సెక్రటరీలు ఓసీ--1 ప్రవీణ్ రెడ్డి,సదానందం,ఓసీ--2 మనోహర్,కేన్ చారి,ఏఎల్పి కొమురయ్య, ఎస్ అండ్ పీ సి రమేష్,నాయకులు కండె రవి,బుద్దే సదానందం,గిరవేణి కొమురయ్య,మేకల మారుతీ, బత్తుల శంకర్,ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ వాస్క్యులర్ డే సందర్భంగా నేడు ఉచిత డాప్లర్ పరీక్షలు

-కాళ్ల నొప్పిని నిర్లక్ష్యం చేస్తే ప్రమాదం : డాక్టర్ పి.సి.గుప్తా



**హైదరాబాద్, ఆగస్టు 5 నవ సంఘర్షణ**
నడిచేటప్పుడు కాళ్ల నొప్పి, తిమ్మిరి, మానని పుండ్లు వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దని, ఇవి రక్తనాళాల బ్లాకేజీకి సంకేతాలు కావచ్చని కేర్ హాస్పిటల్స్, బంజారాహిల్స్ క్లినికల్ డైరెక్టర్, హెచ్‌వోడీ–వాస్క్యులర్ అండ్ ఎండోవాస్క్యులర్ సర్జరీ, వాస్క్యులర్ ఐఆర్, పోడియాట్రిక్ సర్జరీ డాక్టర్ పి.సి.గుప్తా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ దేశంలో 10 కోట్లకు పైగా మధుమేహ రోగులు ఉండగా, డయాబెటిక్ ఫుట్ సమస్యలతో ఏటా దాదాపు లక్ష మంది కాలు కోల్పోతున్నారని చెప్పారు. సకాలంలో డాప్లర్ పరీక్షలతో వ్యాధిని గుర్తిస్తే ఎక్కువ శాతం అవయవ తొలగింపులను నివారించవచ్చన్నారు. జాతీయ వాస్క్యులర్ డే సందర్భంగా ఆగస్టు 6న కేర్ హాస్పిటల్స్, బంజారాహిల్స్‌లో ఉచిత డాప్లర్ పరీక్షలు ఉచిత వైద్య సంప్రదింపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# ఘనంగా ప్రొ.ఇటికల పురుషోత్తం జన్మదిన వేడుకలు



**హైదరాబాద్, ఆగస్టు 5 నవ సంఘర్షణ**
తెలంగాణ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొ.ఇటికల పురుషోత్తం జన్మదినోత్సవాన్ని బుధవారం ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డా.రాజ్ నారాయణ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ.బాలకృష్ణారెడ్డి, కార్యదర్శి ప్రొ.శ్రీరామ్ వెంకటేష్, ఓయూ అడ్మిషన్స్ జాయింట్ డైరెక్టర్ డా.అక్తర్ అలీ, ఓయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.రవితేజ, ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఇట్ట ఉదయశ్రీతో పాటు మేధావులు, వివిధ విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు, డిగ్రీ, పీజీ కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థినీలు పాల్గొని ప్రొ.పురుషోత్తంను శాలువా, పూలమాలలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# పీర్జాదిగూడ మెయిన్ రోడ్డు ప్యాచ్ వర్క్ పూర్తి

సమస్యపై తక్షణమే స్పందించిన కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు బండి శ్రీరాములు గౌడ్.



**మేడిపల్లి, ఆగస్టు 5 నవ సంఘర్షణ**
మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్, 10వ డివిజన్ పరిధిలోని పిర్జాదిగూడ మెయిన్ రోడ్డుపై గుంతలు పడి వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో పీర్జాదిగూడ 10వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బండి శ్రీరాములు గౌడ్ సమయస్ఫూర్తితో వ్యవహరించి ఆ సమస్యను పరిష్కరించారు. మెయిన్ రోడ్డు ప్యాచ్ వర్క్ సమస్యను స్థానిక ప్రజలు శ్రీరాములు గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి తెలిసిన ఒక్క రోజులోనే అధికారులు ప్యాచ్ వర్క్ పనులను పూర్తి చేశారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మాట్లాడుతూ... ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించి, 24 గంటల్లోనే రోడ్డు సమస్యను పరిష్కరించిన బండి శ్రీరాములు గౌడ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజా సంక్షేమం, ప్రాంతీయ అభివృద్ధి కోసం కట్టుబడి ఉంటుందని ఈ సందర్భంగా బండి శ్రీరాములు గౌడ్ స్పష్టం చేశారు.

# సదరం క్యాంపుల నిర్వాహణను స్వయంగా పరిశీలించిన కలెక్టర్.



**ఆగస్టు 5 నవ సంఘర్షణ**
మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రధాన ప్రభుత్వ హాస్పిటల్ లో జరుగుతున్న సదరం క్యాంపుల నిర్వహణను స్వయంగా పరిశీలించి క్యాంప్ కు వచ్చిన వారితో స్వయంగా మాట్లాడిన జిల్లాకలెక్టర్ స్నేహశబరిష్..

## ప్రెజర్ గ్రూప్‌గా పనిచేస్తాం:



**ఛత్రపతి శంభాజీనగర్ ఆగస్టు 5 నవ సంఘర్షణ**
కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మీడియాతో మాట్లడాడు. ప్రస్తుతానికి తమ పార్టీ ఓ ప్రెజర్ గ్రూపులా పనిచేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావడమే తమ ముఖ్య ఉద్దేశం అన్నారు. ప్రస్తుత దశలో భారత్ ఇదే ఉద్యమాన్ని కోరుకుంటోందన్నారు. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో జరగనున్న సీజేపీ కోర్ కమిటీ సమావేశాల నేపథ్యంలో ఆయన రిపోర్టర్లతో మాట్లాడారు. మీడియా, న్యాయ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం సన్నిగిల్లుతోందని, ఇలాంటి అంశాలపై తమ కోర్ కమిటీ మీటింగ్‌లో చర్చించనున్నట్లు చెప్పారు. ఇథనాల్ కలిసిన పెట్రోల్, నిరుద్యోగం లాంటి అంశాలపై కూడా చర్చించనున్నట్లు తెలిపారు. సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ మాకు మెంటర్‌గా పనిచేస్తారని సీజేపీ ప్రతినిధి సౌరవ్ దాస్ అన్నారు. వారి నుంచి సలహాలు తీసుకోనున్నట్లు తెలిపారు. సీజేపీ నిరసన వేళ విద్యార్థులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను ఎత్తివేసేలా వత్తిడి తెస్తామని దాస్ తెలిపారు. ఈ అంశంపై ప్రభుత్వ ప్రతినిధులతో చర్చిస్తున్నామన్నారు.

## చంద్రుడిపై కుప్పకూలిన స్పేస్‌ఎక్స్ రాకెట్ శకలం..



**టెక్సాస్ ఆగస్టు 5 నవ సంఘర్షణ**
స్పేస్‌ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్ అవశేషం ఒకటి చంద్రుడిపై కుప్పకూలింది. శాస్త్రవేత్తలు ఇంకా ఈ ఘటనను ధ్రువీకరించలేదు. కానీ ఈ ప్రక్రియ పూర్తి అయిన ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఫాల్కన్ 9 రాకెట్‌కు చెందిన రీయూజబుల్ భాగం ఒకటి చంద్రుడిపై కూలింది. జనవరి 2025లో ఆ రాకెట్‌ను ప్రయోగించారు. అయిదు అంతస్తుల ఎత్తున్న సైజులో ఆ రాకెట్ శకలం ఉంటుందని భావిస్తున్నారు. భూమిపై ఆ రాకెట్ ముక్క బరువు సుమారు 4వేల కేజీలు ఉంటుంది.ఐన్‌స్టీన్ క్రాటర్ వద్ద స్పేస్‌ఎక్స్ శకలం కూలి ఉంటుందని అంచనా వేస్తున్నారు. రాకెట్ కుప్పకూలండం వల్ల చంద్రుడిపై భారీ స్థాయిలో లోయ ఏర్పడనున్నట్లు ఖగోళ శాస్త్రవేత్తలు అంచనా వేశారు. చంద్రుడి నుంచి ఉద్భవించే దూళి, తాకిడి వల్ల ఏర్పడిన అగాధానికి చెందిన ఫోటోలను అమెరికా టెలిస్కోప్‌లు, నాసా లూనార్ రికన్నయిసెన్స్ ఆర్బిటార్, దక్షిణ కొరియాకు చెందిన దనూరి ప్రోబ్ రిలీజ్ చేసే అవకాశాలు ఉన్నాయి. గంటకు సుమారు 5400 మైళ్ల వేగంతో ఆ స్పేస్‌ఎక్స్ రాకెట్ శకలం ప్రయాణించినట్లు తెలుస్తోంది. ఏడాది నుంచి ఆ రాకెట్ శకలం రోదసీలో చక్కర్లు కొడుతోంది. చంద్రుడిపై రాకెట్ కుప్పకూలడం వల్ల భూమికి ఎటువంటి ప్రమాదం లేదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. రాకెట్ ఢీకొనడం వల్ల చంద్రుడిపై సుమారు 18 మీటర్ల లోతు, 12 మీటర్ల వెడల్పు ఉండే లోయ ఏర్పడే అవకాశాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు.

## ఎర్ర సముద్రంలో భారత నౌకపై దాడి..



**న్యూఢిల్లీ ఆగస్టు 5 నవ సంఘర్షణ**
యెమెన్ తీరానికి సమీపంలోని ఎర్ర సముద్రంలో ప్రయాణిస్తున్న భారత వాణిజ్య నౌకపై దాడి జరిగింది. ఈ ఘటనలో నౌక పూర్తిగా మునిగిపోయిందని, అయితే అందులోని 13 మంది భారతీయ సిబ్బంది సహా మొత్తం 14 మంది సురక్షితంగా బయటపడ్డారని కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్ శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్ తెలిపారు. 'ఎంఎస్‌వి ఫైజే నూరే ఓలియా' అనే భారత జెండాతో ఉన్న నౌకపై ఆగస్టు 4న ప్రొజెక్టైల్ (క్షిపణి లాంటిది)తో దాడి జరిగింది. దీంతో నౌక బోల్తా పడి సముద్రంలో మునిగిపోయింది. వెంటనే స్పందించిన యెమెన్ కోస్ట్ గార్డ్, సిబ్బంది అందరినీ రక్షించి సమీపంలోని మోఖా పోర్టుకు తరలించారు. ఈ ఘటనపై భారత ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. "నిరాయుధులైన సిబ్బంది ఉన్న నౌకపై జరిగిన ఈ అకారణ దాడిని భారత్ తీవ్రంగా ఖండిస్తోంది. మన ప్రజల భద్రతే మాకు అత్యంత ముఖ్యం. సిబ్బంది అందరూ సురక్షితంగా ఉన్నారని తెలియజేయడం ఊరటనిస్తోంది" అని మంత్రి సోనోవాల్ పేర్కొన్నారు. సిబ్బంది సంక్షేమం, భద్రత కోసం అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు.

## దుబాయ్ కార్ల షోరూమ్‌లో గ్యాస్ సిలిండర్ పేలుడు..



**న్యూఢిల్లీ ఆగస్టు 5 నవ సంఘర్షణ**
దుబాయ్‌లోని ఓ కార్ల షోరూమ్‌లో గ్యాస్ సిలిండర్ పేలడంతో కేరళకు చెందిన భారతీయుడు షిజిన్ పాల్ (27) మృతిచెందాడు. ఈ ఘటనలో మరో ఐదుగురు గాయపడ్డారు. షోరూమ్‌లో తొలుత మంటలు చెలరేగగా, వాటిని అదుపు చేసే ప్రయత్నంలో ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించింది. పేలుడు తీవ్రతకు షిజిన్ అక్కడికక్కడే మృతిచెందినట్లు అధికారులు తెలిపారు. కేరళలోని కొల్లాం జిల్లాకు చెందిన షిజిన్ గత నవంబర్‌లో ఉద్యోగం కోసం దుబాయ్‌కు వెళ్లి, కార్ల షోరూమ్‌లో మల్టీమీడియా మార్కెటింగ్ స్పెషలిస్టుగా పనిచేస్తున్నాడు. ఎనిమిదేళ్ల ప్రేమ అనంతరం 2025లో వివాహం చేసుకున్న అతడు, త్వరలోనే తన భార్యను కూడా దుబాయ్‌కు తీసుకెళ్లాలని భావించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.ఈ ఘటనపై భారత రాయబార కార్యాలయం స్పందిస్తూ, మృతుడి కుటుంబంతో సంప్రదింపులు కొనసాగిస్తున్నట్లు వెల్లడించింది. ప్రమాదానికి గల కారణాలపై స్థానిక అధికారులు దర్యాప్తు చేపట్టారు

## నితిన్ గడ్కరీ డీప్‌ఫేక్ వీడియోలను
# వెంటనే తొలగించండి



**న్యూఢిల్లీ ఆగస్టు 5 నవ సంఘర్షణ**
ఈ20 పెట్రోల్ విషయంలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ని లక్ష్యంగా చేసుకుని పలువురు నెటిజన్‌లు ఆన్‌లైన్‌లో డీప్‌ఫేక్ వీడియోలు , పోస్టులు పెట్టడంపై బాంబే హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. కేంద్రమంత్రిని, ఆయన కుటుంబాన్ని ఇంధన వివాదంతో ముడిపెడుతున్న ఏఐ వీడియోలు, పోస్టులను వెంటనే తొలగించాలని మెటా, గూగుల్ సహా పలు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ను ఆదేశించింది.అది అత్యంత నీచమైన కంటెంట్ అని హైకోర్టు మండిపడింది. ఆన్‌లైన్‌లో ఇలాంటి పోస్టులకు చోటు ఉండకూడదని అభిప్రాయపడింది. బాధితులు న్యాయస్థానాలను ఆశ్రయించకుండానే ఇలాంటి నకిలీ పోస్టులను తొలగించడానికి ఏదైనా యంత్రాంగం ఉందా..? అని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లను న్యాయస్థానం ఈ సందర్భంగా ప్రశ్నించింది. విస్తృతమైన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నప్పుడు తప్పుడు పోస్టులపై చర్యలు తీసుకునే యంత్రాంగం మాత్రం ఎందుకు లేదని కోర్టు నిలదీసింది.వ్యక్తుల పరువుకు భంగం కలిగించేలా ఉండే పోస్టులను స్వచ్ఛందంగా తొలగించాలని సూచించింది. ఈ20 (ఇ20) పెట్రోల్‌తో తన కుటుంబం లబ్ధి పొందుతోందంటూ కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని గడ్కరీ ఇటీవల తెలిపారు. దీనిపై ఆన్‌లైన్‌లో డీప్‌ఫేక్ వీడియోలు పెడుతున్నారని పేర్కొంటూ ఆయన బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఈ విషయంలో తన పరువుకు భంగం కలిగించినందుకుగానూ రూ.11 కోట్ల నష్టపరిహారం కోరారు. ఇథనాల్-బ్లెండింగ్ కార్యక్రమం పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరుగుతుందని, ఇందులో తనకు వ్యక్తిగతంగా ఎలాంటి సంబంధం లేదని గడ్కరీ స్పష్టంచేశారు.

# అవసరమైతే వందసార్లయినా అరెస్ట్ అవుతా

**ఎవరి బెదిరింపులకు లొంగేది లేదు: ఉదయనిధి**



**చెన్నై, ఆగస్టు 5 నవ సంఘర్షణ**
సినీ నటి త్రిషా కృష్ణన్‌పై చేసిన వ్యాఖ్యల వివాదంలో అరెస్టయి, విడుదలైన.. డీఎంకే సీనియర్ నేత, తమిళనాడు ప్రతిపక్ష నాయకుడు ఉదయనిధి స్టాలిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. విడుదల అనంతరం తన తండ్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్‌తో ఉన్న ఫొటోను సోషల్ మీడియా 'ఎక్స్'లో షేర్ చేసిన ఆయన.. రాజకీయ ఒత్తిళ్లకు తాను భయపడబోనని స్పష్టం చేశారు. 'నేను కలైంజర్ మనవడిని.. ఎంకే స్టాలిన్ కుమారుడిని.. డీఎంకే కార్యకర్తను. ఇలాంటి బెదిరింపులకు భయపడేది లేదు. రైతుల కోసం పోరాడే క్రమంలో ఒక్కసారి కాదు.. అవసరమైతే వందసార్లు అరెస్ట్ అయ్యేందుకైనా సిద్ధమే. ప్రజాసేవను ఎలాంటి అణచివేత ఆపలేదు' అని ఉదయనిధి స్టాలిన్ తన ఎక్స్ పోస్ట్‌లో రాసుకొచ్చారు. అంతకుముందు.. త్రిషా కృష్ణన్‌పై ఉధయనిధి చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీశాయి. దీంతో మంగళవారం(ఈనెల 4న) పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం సాయంత్రం విడుదల చేశారు. ఆ తర్వాత అధికార పక్షాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారాయన. రైతుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన ప్రభుత్వం.. ప్రజల దృష్టిని మళ్లించేందుకే తనను అరెస్ట్ చేయించిందని ఆరోపించారు. తంజావూరులో తాను చేసిన ప్రసంగాన్ని వక్రీకరించి అసత్య ప్రచారం చేశారని, తప్పుడు కేసులు బనాయించి రాజకీయంగా వేధించేందుకు యత్నించారన్నారు. అరెస్ట్ చేసిన సమయంలో తానేమాత్రం భయపడలేదని, మీడియా ఎదుట ఈ చర్యను హాస్యాస్పదంగా భావిస్తున్నానని చెప్పి మరీ పోలీసులతో వెళ్లానని తెలిపారు. తానెప్పుడూ పారిపోలేదని, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గబోనని చెప్పుకొచ్చారు ఉదయనిధి. లాగే గతంలో కరూర్ తొక్కిసలాట ఘటనను ప్రస్తావిస్తూ.. అధికార పక్షంపై ఉధయనిధి విమర్శలకు దిగారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వం స్పందించకుండా రాజకీయ కక్షసాధింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. తన అరెస్ట్‌ను ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టిన డీఎంకే కార్యకర్తలు, మిత్రపక్ష, ఇతర రాజకీయ పార్టీల నేతలకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

# కోడలు ఇంట్లో అత్తకు నివసించే హక్కు ఉంది

**-హిమాచల్ మైకోర్టు సంచలన తీర్పు**



**సిమ్లా, ఆగస్టు 5 నవ సంఘర్షణ**
:కోడలి ఇంట్లో అత్తగారు కూడా నివసించే హక్కు ఉంటుందని హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. తన సొంత సంపాదనతో కట్టుకున్న ఇంటిలోంచి వెళ్లిపోవాలని అత్తమామలకు కోడలి ఆదేశించడంతో బాధిత అత్తగారు గృహ హింస కింద కేసు పెట్టింది. విచారణ సందర్భంగా ఇల్లు కోడలి పేరు మీద ఉన్నప్పటికీ.. అక్కడ నివసించే హక్కు అత్తగారికి కూడా పూర్తిగా ఉంటుందని న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. మండి జిల్లాల్లోని రామ్‌నగర్‌కు చెందిన వ్యక్తితో 2013, మే నెలలో వివాహం జరిగింది. 2014 వరకు అత్తమామలతోనే కోడలి నివసించింది. అయితే ఇంతలో వివాదాలు తలెత్తడంతో అత్తమామలను ఇంట్లో నుంచి గెంటేసింది. 2025, నవంబర్ 7న ఇంట్లో నుంచి పంపేసి అ÷-దదెకు ఇచ్చేసింది. దీంతో అత్తగారు గృహ హింస కేసు పెట్టింది. అయితే తన సొంత సంపాదనతో నిర్మించుకున్న ఇల్లు అని దిగువ కోర్టులో కోడలు పిటిషన్ వేసింది. అయితే ఈ పిటిషన్‌ను న్యాయమూర్తి రాకేష్ కాంతాలా విచారించి కొట్టేశారు. ఉమ్మడి ఇంట్లో అత్తగారికి హక్కు ఉంటుందని తెలిపింది. అయితే కోడలిపై అత్తగారు పెట్టిన గృహ హింస కేసు తాజాగా హైకోర్టులో విచారణ రాగా.. కోడలి ఇంట్లో అత్తగారికి నివసించే హక్కు ఉంటుందని.. ట్రయల్ కోర్టు తీర్పును సమర్థించింది. ఇరుపక్షాలు కలిసి నివసించినప్పుడు అందరికీ హక్కులు ఉంటాయని తెలిపింది. అత్తమామలు బయటకు పంపేసి అదెకు ఇవ్వడం ఏ మాత్రం సరైందని కాదని పేర్కొంది. గృహ సంబంధంలో నివసిస్తున్న ప్రతి మహిళకు, ఆమె కుమార్తె, సోదరి, భార్య, కోడలు, అత్త అయినా సరే.. ఉమ్మడి గృహంలో నివసించే చట్టపరమైన హక్కు ఉంటుందని స్పష్టం చేసింది. ఇల్లు కోడలి పేరు మీద ఉన్నప్పటికీ.. అక్కడ నివసించే హక్కు అత్తగారికి ఉంటుందని హైకోర్టు తేల్చి చెప్పింది.

# యువత, విద్యార్థుల ఆందోళనలపై సంయమనంతో వ్యవహరించాలి.



**న్యూఢిల్లీ ఆగస్టు 5 నవ సంఘర్షణ**
విద్యార్థులు, యువత ఆందోళనలు చేస్తున్నప్పుడు, అవి ఉద్రిక్తంగా మారినప్పుడు వారిపై దూకుడుగా వ్యవహరించి, అణిచివేసే బదులు సంయమనంతో వ్యవహరించాలని సుప్రీంకోర్టు భద్రతా బలగాలకు సూచించింది. వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని, వీలైనంతవరకు సంయమనంతోనే వ్యవహరించాలని సూచించింది. జూలై 20న సీజేపీ ఆధ్వర్యంలో జరిగిన సంసద్ చలో సందర్భంగా తలెత్తిన ఘర్షణలు, హింస నేపథ్యంలో నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది.సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, వి మోహన ఆధ్వర్యంలోని బెంచ్ విచారణ జరిపింది. ఇప్పటికే ఈ అంశంపై దాఖలైన పాత పిటిషన్లతో కలిపి, కొత్త పిటిషన్‌ను కూడా కోర్టు విచారించనుంది. రిటైర్డ్ ఎయిర్‌ఫోర్స్ అధికారి మనీష్ కుమార్ సోలంకి తాజా పిటిషన్ దాఖలు చేశాడు. ఆయన తరఫున రిజ్వాన్ అహ్మద్ కోర్టులో వాదనలు వినిపించాడు. ఆందోళన జరిగి రెండు వారాలు గడుస్తున్నా, ఈ ర్యాలీ నిర్వహించిన వారిపై చర్యలు తీసుకోలేదని, జవాబుదారీతనం కొరవడిందని రిజ్వాన్ పిటిషన్‌లో పేర్కొన్నాడు. ఇప్పటికీ నిర్వాహకులు మీడియాలో రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని తన పిటిషన్‌లో కోరాడు. దీనిపై విచారణ జరిపిన కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. "ఆందోళనల సందర్భంగా ఎవరైనా తప్పుడు ప్రచారం ద్వారా రాళ్లు రువ్వే చర్యలకు పాల్పడ్డా సరే.. విశాల దృక్పథంతో ఆలోచించి, వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలి. పరిస్థితి మరింత దిగజారకుండా చూడాలి. వారికి సలహా, కౌన్సెలింగ్ కావాలి. వారితో దూకుడుగా వ్యవహరిస్తే అది మరింత దిగజారి, ఇంకా హింసకు దారితీయవచ్చు. అలాంటిది జరగకుండా చూడాలి. వారితో జాగ్రత్తగా వ్యవహరించాలి. దీంతో యువత హింసవైపు వెళ్లకుండా ఉంటారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చి, వారిని శాంతింపజేయడమే మంచిది. అందులో అత్యంత కీలకమైంది వారి వాదన వినడం. వారి ఆవేదన విని, ఎందుకు అరుస్తున్నారో అర్థం చేసుకోవాలి. కానీ, ఇదంతా శాంతి భద్రతల్ని పరిరక్షించే భద్రతా బలగాలకే వదిలేయాలి. మీకన్నా, మాకన్నా ఈ విషయంపై వారికే ఎక్కువ తెలుసు" అంటూ సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఇదే సమయంలో పార్లమెంట్ వైపు ఆందోళనకారులు దూకుడుగా వెళ్లడాన్ని కూడా కోర్టు ప్రశ్నించింది. ప్రజాస్వామ్యానికి పార్లమెంట్ దేవాలయం వంటిదని, అలాంటి దేవాలయం ధ్వంసం కాకుండా చూడాల్సిన బాధ్యత భద్రతా బలగాలపై ఉంటుందని కూడా కోర్టు వ్యాఖ్యానించింది.

# యుద్ధ వీరుడిగా సందీప్ కిషన్..

## - భారీ పీరియాడిక్ యాక్షన్ చిత్రం రెండు పార్టులుగా విడుదల!




యంగ్ హీరో సందీప్ కిషన్ తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. విభిన్న కథలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్న ఆయన, ఇప్పుడు పీరియాడిక్ యాక్షన్ జానర్‌లోకి అడుగుపెడుతున్నారు. తాజాగా 'కరికాల' అనే భారీ చిత్రాన్ని అధికారికంగా ప్రకటిస్తూ మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. పోస్టర్ విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారి సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఇటీవలి కాలంలో పీరియాడిక్ కథలు, రాజుల చరిత్ర, యుద్ధ నేపథ్యంతో రూపొందుతున్న సినిమాలకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. అదే తరహాలో ఇప్పుడు సందీప్ కిషన్ కూడా ఓ భారీ పీరియాడిక్ కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు.'శంబాల' చిత్రంతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న యుగంధర్ ముని ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై మహీధర్ రెడ్డి, రాజశేఖర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో సందీప్ కిషన్ శక్తివంతమైన యోధుడి పాత్రలో కనిపిస్తున్నారు. చేతిలో కత్తి పట్టుకుని గుర్రంపై యుద్ధానికి దూసుకెళ్తున్న ఆయన లుక్ ఆకట్టుకుంటోంది. పోస్టర్‌లో ఆయన పక్కనే ఓ సింహం కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యుద్ధభూమి వాతావరణం, భారీ విజువల్స్, పవర్‌ఫుల్ లుక్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. పోస్టర్‌ను బట్టి చూస్తే, ఇది కేవలం యాక్షన్ సినిమా మాత్రమే కాకుండా చారిత్రక నేపథ్యంతో కూడిన ఎమోషనల్ సాగా కూడా కావచ్చని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్‌ను రెండు భాగాలుగా తెరకెక్కించనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. విడుదల తేదీలను కూడా అధికారికంగా వెల్లడించారు. 'కరికాల -- చాప్టర్ 1' : 2027 జూలై 2, 'కరికాల -- చాప్టర్ 2' : 2027 అక్టోబర్ 28 అంటే కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే రెండు భాగాలను విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేయడం విశేషంగా మారింది. ఇప్పటివరకు సందీప్ కిషన్ ఎక్కువగా యాక్షన్, థ్రిల్లర్, కామెడీ, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రాల్లో కనిపించారు. అయితే 'కరికాల' తో తొలిసారి భారీ పీరియాడిక్ యాక్షన్ కథలో నటిస్తున్నారు. పాత్ర కోసం ఆయన ప్రత్యేకంగా శిక్షణ తీసుకునే అవకాశం ఉందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. 'కరికాల' ఫస్ట్ లుక్ పోస్టర్‌కు సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. సందీప్ కిషన్ కొత్త అవతారం, భారీ కాన్సెప్ట్, రెండు భాగాల విడుదల ప్రకటనతో ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు ఒక్కసారిగా పెరిగాయి.అయితే సినిమా కథ, ఇతర నటీనటులు, సాంకేతిక బృందానికి సంబంధించిన పూర్తి వివరాలను మేకర్స్ త్వరలో వెల్లడించే అవకాశం ఉంది. పీరియాడిక్ యాక్షన్ చిత్రాల జోరు కొనసాగుతున్న సమయంలో వస్తున్న 'కరికాల' ప్రేక్షకులను ఏ స్థాయిలో ఆకట్టుకుంటుందో చూడాలి.

# బేబీ జోడీ మళ్లీ వస్తోంది..

# ఆనంద్ దేవరకొండ

## వైష్ణవి చైతన్య 'ఎపిక్' రిలీజ్ డేట్ ఫిక్స్!




బేబీ' సినిమాతో బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకుని ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జోడీ మరోసారి వెండితెరపై సందడి చేసేందుకు సిద్ధమవుతోంది. వీరిద్దరూ కలిసి నటిస్తున్న తాజా చిత్రం 'ఎపిక్' విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్న నేపథ్యంలో మేకర్స్ విడుదల చేసిన ఈ అప్డేట్ అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతోంది. తాజాగా చిత్రబృందం ప్రకటించిన వివరాల ప్రకారం, 'ఎపిక్ -- ఫస్ట్ సెమిస్టర్' ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 11న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.రిలీజ్ డేట్ పోస్టర్‌ను సోషల్ మీడియాలో విడుదల చేయగా, అభిమానుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. 'ఫస్ట్ సెమిస్టర్' అనే ట్యాగ్‌తో పోస్టర్‌ను విడుదల చేయడం సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ కాన్సెప్ట్ వెనుక కథ ఏమిటన్న దానిపై కూడా చర్చ మొదలైంది. ఈ చిత్రానికి ఆదిత్య హసన్ దర్శకత్వం వహిస్తున్నారు. యువతను ఆకట్టుకునే కథ, భావోద్వేగాలతో పాటు వినోదానికి ప్రాధాన్యం ఇస్తూ సినిమాను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార కార్యక్రమాలు సినిమాపై పాజిటివ్ బజ్‌ను తీసుకొచ్చింది. ఈ చిత్రాన్ని తెలుగు సినీ పరిశ్రమలో వరుస విజయాలతో దూసుకెళ్తున్న సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, శ్రీకర స్టూడియోస్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ప్రముఖ నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ మరియు సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వారి బ్యానర్ల నుంచి వస్తున్న చిత్రం కావడంతో ప్రేక్షకుల్లో అంచనాలు మరింత పెరిగాయి. యువ సంగీత దర్శకుడు అజీమ్ మొహమ్మద్ సంగీతాన్ని అందిస్తున్నారు. కథకు తగ్గట్టుగా సంగీతం, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌ను ప్రత్యేకంగా రూపొందిస్తున్నట్లు సమాచారం. 2023లో విడుదలైన 'బేబీ' చిత్రం ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య కెరీర్‌లో భారీ మలుపు తీసుకొచ్చింది. వీరిద్దరి కెమిస్ట్రీకి ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభించింది. ఇప్పుడు అదే జోడీ మరోసారి కలిసి నటిస్తుండటంతో 'ఎపిక్'పై సహజంగానే భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ సినిమాలో కూడా వీరిద్దరి మధ్య భావోద్వేగభరితమైన కథ, కొత్త తరహా పాత్రలు ఉండనున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. సెప్టెంబర్ 11 విడుదల తేదీ ప్రకటించడంతో 'ఎపిక్'పై సినీ అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. 'బేబీ' తర్వాత మరోసారి ఆనంద్ దేవరకొండ -- వైష్ణవి చైతన్య జోడీ ప్రేక్షకులను ఏ స్థాయిలో ఆకట్టుకుంటుందో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ఒక రోజు ముందే రాబోతున్న వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు'!



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా, టాలెంటెడ్ బ్యూటీ రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తోన్న విభిన్న చిత్రమైన 'కొరియన్ కనకరాజు' విడుదల విషయంలో మేకర్స్ ఒక ఆసక్తికరమైన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. ప్రముఖ దర్శకుడు మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాపై ఇండస్ట్రీలో మరియు ప్రేక్షకులలో మంచి అంచనాలు నెలకొన్నాయి. హారర్, కామెడీ మరియు డ్రామా జోనర్లను అద్భుతంగా మిక్స్ చేస్తూ, పూర్తిగా కొరియన్ నేపథ్యంలో సాగే వినూత్న కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందించారు. అయితే సినిమా అవుట్‌పుట్ పట్ల ఎంతో సంతృప్తిగా ఉన్న చిత్రబృందం, తమపై ఉన్న గట్టి నమ్మకంతోనే అసలు షెడ్యూల్ చేసిన విడుదల తేదీకంటే ముందే థియేటర్లలో సందడి చేయడానికి సిద్ధమైంది.ఇటీవల ఘనంగా జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ వేదికగా మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ స్వయంగా ఈ అప్‌డేట్‌ను అభిమానులతో పంచుకున్నారు. ఈ సినిమా సాధారణ ప్రదర్శనలకంటే ఒక రోజు ముందే, అనగా ఆగస్ట్ 6వ తేదీ రాత్రే ప్రత్యేకమైన పెయిడ్ ప్రీమియర్స్ ద్వారా థియేటర్లలోకి రాబోతున్నట్లు ఆయన అధికారికంగా ప్రకటించారు. సినిమా కంటెంట్ చాలా స్ట్రాంగ్‌గా ఉందని, అందుకే ఈ ముందస్తు ప్రీమియర్స్ వేయడానికి ఎలాంటి సంకోచం లేదని వరుణ్ తేజ్ ధీమా వ్యక్తం చేశారు. ఇక ఈ చిత్రానికి సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్.ఎస్. థమన్ తనదైన శైలిలో అరిస్టోక్రాటిక్ మ్యూజిక్ మరియు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తుండగా.. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మించింది. విభిన్నమైన కథాంశంతో రాబోతున్న ఈ కొరియన్ కనకరాజు ప్రేక్షకులను ఏ స్థాయిలో నవ్విస్తూ భయపెడతాడో చూడాలి మరి.

# అది మన చేతుల్లో ఉండదు!

ప్రెగ్నెన్సీ కారణంగా ప్రస్తుతం సినిమాలకు పూర్తిగా బ్రేక్‌నిచ్చి విశ్రాంతి తీసుకుంటున్నది అగ్ర కథానాయిక సమంత. అయితే సోషల్‌మీడియాలో మాత్రం యాక్టివ్‌గా ఉంటూ అభిమానులతో అప్‌డేట్స్‌ను పంచుకుంటున్నది. తాజాగా ఈ భామ ఇన్‌స్టా వేదికగా కొన్ని ఫొటోలను షేర్ చేసింది. వీటికి తనదైన తాత్విక ధోరణిలో ఓ క్యాప్షన్‌ను జత చేసింది. 'సమయం ఎల్లప్పుడూ ఒకేలా ఉండదు. కొన్ని సార్లు మనల్ని పోరాటం వైపుకు నడిపిస్తుంది. కొన్నిసార్లు ఓపికతో ఎదురుచూసేలా చేస్తుంది.ఒక్కోసారి కొన్నింటిని వదిలేయాలని సంకేతాల్ని అందిస్తుంది. మనకు ఏ సమయం కావాలో ఎంచుకునే అవకాశం మన చేతుల్లో ఉండదు. అయితే ఏం జరిగినా మనదైన వ్యక్తిత్వంతో ఎలా జీవితంలో ముందుకుసాగుతున్నామన్నదే చాలా ముఖ్యం' అంటూ ఫొటోలకు పెట్టిన క్యాప్షన్ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. ఇటీవలే 'మా ఇంటి బంగారం' సినిమాతో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది సమంత. ఈ సినిమా వందకోట్ల వసూళ్లతో ఆమె కెరీర్‌కు కొత్త ఉత్సాహాన్నిచ్చింది.



# ఓజి 2'పై థమన్ సూపర్ అప్డేట్..

## పవన్ ఫ్యాన్స్‌కు సెప్టెంబర్‌లో బిగ్ సర్‌ప్రైజ్ ఖాయమా?




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రాజెక్ట్‌లలో 'ఓజి 2' ఒకటి. దర్శకుడు సుజీత్ తెరకెక్కించనున్న ఈ ప్రీక్వెల్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. 'ఓజి' విశ్వాన్ని మరింత విస్తరించేలా రూపొందనున్న ఈ చిత్రానికి సంబంధించిన ప్రతి చిన్న అప్డేట్ కూడా అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. కొద్ది రోజుల క్రితం పవన్ కళ్యాణ్ ఆరోగ్య సమస్యల కారణంగా ఈ ప్రాజెక్ట్ షెడ్యూల్‌పై పలు రకాల ఊహాగానాలు వినిపించాయి. దీంతో సినిమా ఆలస్యమవుతుందనే ప్రచారం కూడా సోషల్ మీడియాలో జోరుగా సాగింది. అయితే ఈ వార్తల మధ్య సంగీత దర్శకుడు ఎస్. థమన్ అభిమానులకు ఊరటనిచ్చే అప్డేట్ అందించారు.వరుణ్ తేజ్ నటించిన 'కొరియన్ కనకరాజు' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న థమన్‌ను అభిమానులు 'ఓజి 2' గురించి ప్రశ్నించారు. దీనికి స్పందించిన ఆయన, "సెప్టెంబర్ వరకు వేచి ఉండండి" అంటూ అభిమానులకు హామీ ఇచ్చారు. ఇప్పటికే పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా 'ఓజి 2' నుంచి ప్రత్యేక అప్డేట్ ఉంటుందని థమన్ గతంలోనే వెల్లడించారు. తాజాగా మరోసారి అదే విషయాన్ని పరోక్షంగా ధృవీకరించడంతో సెప్టెంబర్‌లో చిత్ర బృందం నుంచి గ్లింప్స్, పోస్టర్ లేదా మరేదైనా ప్రత్యేక ప్రకటన వచ్చే అవకాశాలు ఉన్నాయని అభిమానులు భావిస్తున్నారు. ఇటీవలి కాలంలో 'ఓజి 2' షూటింగ్ మరికొంత ఆలస్యమవుతుందనే వార్తలు వైరల్ అయ్యాయి. అయితే ఆ ప్రచారానికి భిన్నంగా థమన్ చేసిన వ్యాఖ్యలు అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. సినిమా షెడ్యూల్‌లో మార్పులు వచ్చినా, సెప్టెంబర్‌లో ప్రకటించిన అప్డేట్ మాత్రం తప్పకుండా ఉంటుందని ఆయన స్పష్టం చేసినట్లైంది. అదే వేదికపై థమన్ చేసిన మరో కామెంట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. "మళ్లీ గడ్డం పెంచుతున్నా... మీసం తిప్పాలా లేదా?" అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. ఈ కామెంట్లను పవన్ కళ్యాణ్ 'ఓజి 2' లుక్‌కు సంబంధించిన హింట్‌గా అభిమానులు భావిస్తున్నారు. దీంతో సినిమాలో పవన్ కొత్త గెటప్ ఎలా ఉండబోతోందనే ఆసక్తి మరింత పెరిగింది. 'ఓజి' ప్రపంచాన్ని మరింత విస్తరించే ఈ ప్రీక్వెల్‌ను దర్శకుడు సుజీత్ అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించనున్నట్లు సమాచారం. పవన్ కళ్యాణ్ ఇమేజ్‌కు తగ్గట్టుగా యాక్షన్, ఎమోషన్, స్టైలిష్ మేకింగ్‌తో ఈ చిత్రం రూపొందనుందని సినీ వర్గాలు చెబుతున్నాయి.